Estd:2023

3rd ANNIVERSARY

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

RNI. NO.: TELTEL/2023/85598

www.sooryasena.com








శనివారం SATURDAY || 29.08.2026 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 329 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah


# 'నేను అందరికీ సోదరినే':

## సీఎం రేవంత్‌కు రాఖీ కట్టి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి):** ఇటీవలి రాజకీయ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖల భేటీ తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సురేఖ కుమార్తె కొండా సుస్మితా పటేల్ పరకాల నియోజకవర్గ వివాదంలో ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన ఘాటు వ్యాఖ్యలు, ఆపై కాంగ్రెస్ క్రమ శిక్షణా కమిటీ చర్యలకు సిఫార్సు చేసిన నేపథ్యం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఉత్కంఠ వాతావరణం, విభేదాల వార్తల మధ్య రాఖీ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని మంత్రి కొండా సురేఖ సీఎం నివాసానికి వెళ్లారు. అనంతరం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఆయన మనవడికి, అల్లుడికి కూడా ఆమె ఆత్మీయంగా రాఖీ కట్టి శుభాకాంక్షలు తేలిపారు. రాఖీ కట్టిన అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడు తూ.. "పండుగ వాతావర ణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. నేను అందరికీ సోదరినే. సీఎం రేవంత్ రెడ్డికి రాష్ట్రంలోని మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి చేసే శక్తిని, ఆయురారోగ్యాల ను రేవంత్‌కు అందించాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వా దాలు ఆయనకు ఎల్లవేళలా ఉండాలి" అని కొండా సురేఖ పేర్కొన్నా రు. కాగా, కూతురి కామెంట్స్, పార్టీ క్రమశిక్షణా నోటీసులతదనంతర పరిణామాల మధ్య కొండా సురేఖ నేరుగా సీఎంను కలవడం, రాఖీ కట్టి ఈ వ్యాఖ్యలు చేయడం రాజకీయంగా సరికొత్త రాజీ మార్గానికి సంకేతమని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మోడీ వైపే ప్రజలు..

# కాక్రోచ్ పార్టీకి షాక్..

- తాజా సర్వేలో సంచలనం..- పేపర్ లీక్‌లు, నిరుద్యోగంపై యువతలో తీవ్ర అసంతృప్తి.- పరీక్షా వ్యవస్థపై యువతకు అపనమ్మకం..-అయినప్పటికీ మోడీపైనే దేశ ప్రజల విశ్వాసం..

**న్యూఢిల్లీ, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి):** దేశ రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే "మూడ్ ఆఫ్ ది నేషన్ " ఆగస్టు 2026 ఫలితాలు ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే మరోసారి బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 326 సీట్లతో అధికారంలోకి వస్తుందని అంచనా వేసింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమికి 185 సీట్లు వస్తాయని అంచనా వేసింది. అయితే, ప్రశ్నాపత్రాల లీకేజ్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం వంటి అంశాలపై యువత అసంతృప్తిగా ఉన్నప్పటికీ, ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వం వైపే యువత ,జెన్–జీ ఉన్నట్లు తెలిపింది. ఇటీవల ప్రశ్నా పత్రాల లీకులు, కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమం నేపథ్యంలో ఈ సర్వే కీలక విసయాలను వెల్లడించింది. పరీక్షల నిష్పాక్షికతపై 40 శాతం మంది యువతకు నమ్మకం లేదని, మరో 27 శాతం మంది ఈ వ్యవస్థపై చాలా తక్కువ నమ్మకం ఉందని తెలిపారు. మొత్తంగా 67 శాతం మంది యువత పరీక్షా వ్యవస్థపై అనుమానాలు వ్యక్తం చేయగా, కేవలం 14శాతం మంది మాత్రమే అది పూర్తిగా నిష్పాక్షికంగా ఉందని భావించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాల ప్రక్రియ చాలా నెమ్మదిగా జరుగుతోందని, నమ్మదగిన దిగాలేదని 17శాతం జెన్–జీ యువత అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ అతిపెద్ద వైఫల్యంపై ప్రశ్నించగా.. రిగ్గింగ్, అవినీతిని అరికట్టడంలో విఫలమవడమే ప్రధాన కారణమని 9.8 శాతం మంది చెప్పారు. గతసర్వేలో ఈ అభిప్రా యం కేవలం 1.4 శాతంగా ఉండటం గమనార్హం.ప్రశ్నా పత్రాల లీకేజీలపై ఉన్న ఆగ్రహానికి నిరుద్యోగం, ద్రవ్యోల్బణం తోడైనట్లు సర్వే వెలల్లడించింది. దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యగా 22.7 శాతం మంది నిరుద్యోగాన్ని పేర్కొన్నారు. నిరుద్యోగ పరిస్థితి



చాలా తీవ్రమైందిగా 42.3 శాతం, మ రో 23.8శాతం తీవ్రమైందిగా పేర్కొన్నారు. బీజేపీ కూటమి ప్రభుత్వంలో 23 శాతం ద్రవ్యోల్బణం, 15.9 శాతం మంది నిరుద్యోగాన్ని అతిపెద్ద వైఫల్యాలుగా చెప్పారు. రోజూ వారీ ఖర్చులు గతేడాదితో పోలిస్తే కష్టంగా మారిందని 65 శాతం మంది చెప్పారు. పేపర్ లీక్‌లకు వ్యతిరేకంగా, విద్య కోసం, జెన్–జీ కోసం పోరాడుతున్న కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ)కి ప్రజలు షాక్ ఇచ్చారు. 39 శాతం మంది యువత అది 'ప్రెజర్ గ్రూపు"గానే పనిచేయాలని, రాజకీయ పార్టీగా మారకూడదని చెప్పారు. ఒక వేళ సీజేపీ ఎన్నికల్లో పోటీ చేస్తే ఓటు వేస్తారా అనే ప్రశ్నకు 43 శాతం మంది నిరాకరించగా, 33 శాతం మంది మద్దతు తెలిపారు.

# నేపాల్‌కి దూసుకొస్తున్న మరో మహా ప్రళయం..?

చైనా, నేపాల్ సరిహద్దు ప్రాంతం అయిన సిచువాన్ ప్రావిన్స్‌లో 5.1 తీవ్రతతో భూకంపం సంభవించింది. దీంతో నేపాల్‌లో వరద బీభత్సం ఇంకా తగ్గకముందే మరో పెను విలయం విరుచుకుపడనుందన్న హెచ్చరికలు యావత్ దేశాన్ని వణికిస్తున్నాయి. మూడు రోజుల క్రితం వచ్చిన ఆకస్మిక వరద (టశ్రీఖంష్ట్ర టశ్రీశీశీ) కంటే దాదాపు ఐదు రెట్లు అధిక తీవ్రత తో కూడిన మరో డెడ్లీ వరద ముంచుకొస్తోందని స్థానిక అధికారులు, పోలీసులు అత్యవసర ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. నదీ పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి ఉప్పెనలా దూసుకొస్తున్న ఈ వరద మరో 20 నిమిషాల్లో లోతట్టు ప్రాంతాలను ముంచెత్తనుందని సమాచారం అందడంతో ప్రభావిత ప్రాంతాల్లో తక్షణమే రెడ్ అలర్ట్ప్రకటించారు. దీంతో స్థానిక ప్రజలు, యాత్రికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని సురక్షిత ప్రాంతాల వైపు పరుగులు తీస్తున్నారు. తీవ్ర విపత్తు పొంచి ఉన్న నేపథ్యంలో ప్రాణనష్టాన్ని నివారించేందుకు స్థానిక ప్రభుత్వం, భద్రతా దళాలు యుద్ధప్రాతిపదికన తరలింపు చర్యలు చేపట్టాయి. లోతట్టు నివాసాల నుంచి ప్రజలను వెంటనే ఖాళీ చేయిస్తూ సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. మరోవైపు




తాజా వరద ముప్పు, భయానక వాతావరణ పరిస్థితుల కారణంగా ఇప్పటివరకు కొనసాగుతున్న సహాయక, గాలింపు చర్యలు (రెస్క్యూ ఆపరేషన్లు) ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఏ క్షణంలో ఏం జరుగుతుందో, జల ప్రళయం ఎలాంటి విధ్వంసం సృష్టిస్తుందో తెలియక ప్రజలు తీవ్ర భయాందోళనల మధ్య బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

# 'రిజర్వేషన్లు హటావో' ఆందోళనపై స్పందించిన కేంద్రం..

**న్యూఢిల్లీ, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి):** కుల ఆధారిత రిజర్వేషన్ల స్థానంలో ఆర్థిక ప్రాతిపదికన మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' పేరిట దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలు కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువత చేపట్టిన ఈ నిరసనలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఆగస్టు 21న జంతర్ మంతర్ వద్ద జరిగిన భారీ ఆందోళనల అనంతరం.. నిరసనకారుల ప్రతినిధి బృందంతో కేంద్ర మంత్రి జేపీ నడ్డా న్యూఢిల్లీలో సమావేశమయ్యారు. హర్ష్ దూబే, రణ్ బహదూర్ సింగ్ చౌహాన్, మృత్యుంజయ్ పాఠక్‌లతో కూడిన బృందంతో ముందస్తు షెడ్యూల్ ప్రకారం సానుకూల వాతావరణంలో చర్చలు జరిగాయని, ఈ అంశంపై త్వరలోనే మరోసారి భేటీ అయి చర్చిస్తామని జేపీ నడ్డా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు. రిజర్వేషన్ల విధానంలో మార్పులు తేవాలని, 'ఒకే కుటుంబం – ఒకే రిజర్వేషన్' విధానాన్ని అమలు చేయాలని నిరసనకారులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర మంత్రితో జరిగిన ఈ చర్చలు సమస్య పరిష్కారానికి తొలి అడుగని 'రిజర్వేషన్ హటావో ఆందోళన్' ప్రతినిధి హర్ష్ దూబే పేర్కొన్నారు. అయితే తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై దేశవ్యాప్తంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించని పక్షంలో జంతర్ మంతర్ వద్ద మరింత భారీ స్థాయిలో ఆందోళనలను ఉధృతం చేస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు.




## కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై

# బీఆర్ఎస్ 'పోరుబాట'

హైదరాబాద్, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై పోరుబాటకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ శ్రేణులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన మాజీ మంత్రి.. నేతలకు దిశానిర్దేశం చేశారు. సెప్టెంబర్ 2 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసాలు చేసిందంటూ బీఆర్ఎస్ పోరుబాటకు సిద్ధమైంది. వారం రోజుల పాటు వినూత్న నిరసన కార్యక్రమాలను చేపట్టాలని, 420 హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించారు. వెయ్యి రోజులైనా నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని, కాంగ్రెస్ హామీల వైఫల్యం, అవినీతిపై పోరాడాలని టెలికాన్ఫరెన్స్‌లో నేతలకు కేటీఆర్ నిర్దేశం చేశారు. సెప్టెంబర్1న తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ఛార్జ్‌షీట్‌తో బీఆర్ఎస్ ప్రజల్లోకి వెళ్లనుంది



## కర్ణాటకలోని 'హట్టి గోల్డ్ మైన్స్ ను

# సందర్శించిన భట్టి విక్రమార్క

**బెంగళూరు, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లాలోని దేశంలోనే ఏకైక ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'హట్టి గోల్డ్ మైన్స్ ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా భూగర్భ (అండర్‌గ్రౌండ్), ఓపెన్‌కాస్ట్ గనులతో పాటు అక్కడి ప్రొడక్షన్ యూనిట్లు, బంగారం శుద్ధి కేంద్రాల పనితీరును ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మైనింగ్, శుద్ధి ప్రక్రియలకు సంబంధించిన సమగ్ర వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సింగరేణి సంస్థను కేవలం సంప్రదాయ బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేయకుండా, బంగారం, రాగి వంటి కీలక లోహాలు, ఖనిజాల అన్వేషణ, ఉత్పత్తిరంగాల్లోనూ ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా వెల్లడించారు.




# ఆందోళనకారులపై సీఐ దౌర్జన్యం....?

- మహిళలపైనా చేయి చేసుకున్నారంటూ ఆరోపణలు!
- న్యాయం అడిగితే లాఠీ దెబ్బలేనా..? బాధితులపై సీఐ అత్యుత్సాహం!
- 30 ఏళ్ల జీవనాధారం తొలగిస్తే ప్రశ్నించకూడదా..? బాధితులపై సీఐ దురుసు తీరు!
- బాధితుల నిరసనపై పోలీసు ప్రతాపం.. సీఐ తీరుపై తీవ్ర విమర్శలు!
- మహిళలను తోసివేత.. బాధితుడిపై దాడి ఆరోపణలు.. సీఐపై చర్యలకు డిమాండ్!



సూర్యాపేట / కోదాడ, ఆగస్టు 28 (సూర్య సేన): కోదాడ పట్టణంలో డబ్బా కొట్టు తొలగింపు వ్యవహారం ఉద్రిక్తతకు దారితీసింది. తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా డబ్బా కొట్టును తొలగించారని ఆరోపిస్తూ బాధితులు రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ఆందోళనకారులతో సీఐ శివశంకర్ వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. బాధితులపై దాడికి దిగడంతో పాటు మహిళలను సైతం తోసివేశారంటూ ఆరోపణలు వెల్లువెత్తాయి. బాధితుల వివరాల ప్రకారం.. గత 30 ఏళ్లుగా డబ్బా కొట్టుపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నామని, దాని ద్వారా వచ్చే ఆదాయంతో తమ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఒక్కసారిగా డబ్బా కొట్టును తొలగించడంతో తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతిన్నదని ఆవేదన వ్యక్తం చేశారు.




2వ పేజీ లో...








# భూదాన్ భూములను రక్షించి - నిరుపేదలకు పంచాలి




**- సర్వోదయ నాయకుడు శంకర్ నాయక్..**

**రంగారెడ్డి, ఆగస్టు 28 (సూర్య సేన) :** భూదాన్ భూములను రక్షించి నిరుపేద బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణ పేదలకు అట్టి భూములను పంచాల్సిన అవసరం ఉన్నది అని తెలంగాణ రాష్ట్ర సర్వోదయ మండల అధ్యక్షుడు ఆర్ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం పటాన్ చెరువు ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో మేధావుల ఫోరం సభ్యులు, సామాజిక కార్యకర్త ఉప్పరి రవి అధ్యక్షతన భూదాన్ భూముల పరిరక్షణ, నిరుపేద కుటుంబాలకు పంపిణీ అన్న అంశం పై సమావేశం నిర్వహించినట్లు ఆర్ శంకర్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ సామాజికవేత్త వినోబాభావే 14 ఏళ్ల దేశవ్యాప్త పాదయాత్ర నిర్వహించి, వేల ఎకరాల భూమిని నిరుపేద ప్రజలకు పంచారని అన్నారు. దేశంలోనే అప్పటి మన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మొట్టమొదటిగా భూదాన్ భూముల పంపిణీ జరిగిందన్నారు. లక్షల కోట్ల విలువైన భూధాన్ బీదల భూముల పై భూకబ్జాదారుల కళ్ళు పడి, అట్టి భూములను కబ్జా చేస్తుండడం సహించరాని నేరమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇట్టి భూదాన్ భూముల పై దృష్టి పెట్టి, భూదాన్ భూములను రీ సర్వే చేయించి, అట్టి భూములను నిరుపేదలకు చెందే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకొని, జిల్లా కలెక్టర్ లకు ప్రభుత్వపరంగా ఆదేశించాల్సిన అవసరం ఉన్నదని శంకర్ నాయక్ అన్నారు. సంగారెడ్డి జిల్లా భూదాన్ భూముల పరిరక్షణ కమిటీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్ రాజు ముదిరాజ్ మాట్లాడుతూ భూదాన్ భూముల పరిరక్షణ కమిటీకి జిల్లా అధ్యక్షుడిగా తనను ఎన్నిక చేసినందుకు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ శంకర్ నాయక్ కు ప్రత్యేకధన్యవాదాలు తెలిపారు. ఎంతో నమ్మకంతో తనకు జిల్లా అధ్యక్ష పదవి అప్పు చెప్పినందుకు కృతజ్ఞత గా జిల్లా వ్యాప్తంగా ఉన్న భూదాన్ భూముల పై దృష్టి పెడతానని, భూ కబ్జాదారుల భరతం పడతానని అన్నారు.

సంగారెడ్డి జిల్లా భూదాన్ భూముల పరిరక్షణ కమిటీ కి ముఖ్య సలహాదారుడుగా ఎన్నికైన హైకోర్టు న్యాయవాది కిషన్ మామిళ్ళ, గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన ఉప్పరి రవి, అన్వర్ పటేల్, ఉపాధ్యక్షులు గోపాల్, ఎం భాస్కర్, సర్వోదయ మండల రాష్ట్ర కార్యదర్శి వై గిరి ప్రసాద్, రంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు




నాగజ్యోతి తదితరులు మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రకుల నిరుపేదలకు భూదాన్ భూములను పంచాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. సంగారెడ్డి జిల్లా భూదాన్ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షులుగా ఎన్నికైన ఎన్ రాజు ముదిరాజ్ మాట్లాడుతూ భూ కబ్జాదారుల నుంచి అట్టి భూములను రక్షించి, నిరుపేదలకు చెందే విధంగా కృషి చేస్తానని ఎన్ రాజు ముదిరాజ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూధాన్ భూముల విషయంలో ప్రత్యేకమైన దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. భూముల రీ సర్వే చేయించి, వ్యవసాయం చేసుకోవడానికి ఇంటికి 3 ఎకరాల భూమిని కేటాయించాలని, ఇండ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాల మంజూరు చేయాలని ఎం రాజు ముదిరాజ్ అన్నారు. తనను సంగారెడ్డి జిల్లా భూదాన్ భూముల పరిరక్షణ కమిటీ అధ్యక్షుడుగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ నాయక్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కనీస వేతనాల చట్టం బోర్డు సభ్యులు ఎన్ రాజు ముదిరాజ్.

## హిమగిరి కన్నీరు...మంజుల పత్తిపాటి



హిమాలయం కన్నీరు కార్చి,
నేపాల్ ఒడిలో విషాదం నింపింది..!

మంచు కొండలు కరిగి కదిలిన వేళ...
మట్టి ప్రవాహం మానవ గుండెల్ని ముంచింది..!

నిన్నటి వరకు నిశ్శబ్దంగా ఉన్న పర్వతం...
నేడు పెను ప్రవాహమై పరుగెత్తింది..!
చెట్లు, ఇళ్లు, కన్న కలలన్నీ
ఒక్క క్షణంలో నీటిలో కలిసి పోయింది..!

ప్రకృతి కోపమా?
లేక మనం చేసిన తప్పుల ప్రతిధ్వనియా అని ఆలోచన చేయండి..?

పెరుగుతున్న వేడి... కరుగుతున్న మంచు...
రాబోయే ప్రమాదానికి ప్రకృతి హెచ్చరిక అని గుర్తించండి..!

ప్రకృతి పలికిన ప్రళయపు పలుకులు...
మనం వినాల్సిన మౌనపు హెచ్చరికలు.. అందుకే
ప్రకృతిని ప్రేమిద్దాం
ప్రకృతితో కలిసి జీవిద్దాం..!

లేకపోతే నేడు వరదగా వచ్చిన కన్నీరు
రేపు మన గడపను తడపవచ్చు.

నేపాల్ నేల మళ్లీ నవ్వాలి..!
హిమాలయం మళ్లీ ప్రశాంతంగా నిలవాలి..!

**రచన: మంజుల పత్తిపాటి**
**మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్**
**యాదాద్రి భువనగిరి జిల్లా**
**తెలంగాణ రాష్ట్రం**
**హొచరవాణి 9347042218**

# ఆందోళనకారులపై సీఐ దౌర్జన్యం...?

తమకు ప్రత్యామ్నాయ జీవనోపాధి చూపించాలని, తొలగింపు చర్యలపై న్యాయం చేయాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్ ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆందోళన చేస్తున్న మండల ఉపేందర్‌పై సీఐ దాడికి దిగినట్లు బాధితులు ఆరోపించారు. ఉపేందర్‌ను రోడ్డుపైకి నెట్టివేసి, అనంతరం



లాక్కెళ్లి పోలీసు వాహనంలో పడేసినట్లు ప్రత్యక్షంగా ఉన్న వారు పేర్కొన్నారు. దీనిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను సైతం తోసివేయడంతో అక్కడ కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఘటనను చిత్రీకరిస్తున్న ఓ జర్నలిస్టుపైనా సీఐ రెండుసార్లు దాడికి దిగినట్లు ఆరోపణలు రావడం మరింత చర్చనీయాంశంగా మారింది. ఆందోళనకారులపై పోలీసులు వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారుతున్నాయి. వీడియోల్లో కనిపిస్తున్న దృశ్యాలపై పలువురు తీవ్రంగా స్పందిస్తూ పోలీసుల తీరును ప్రశ్నిస్తున్నారు.

తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమపై పోలీసులు దురుసుగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. 30 ఏళ్లుగా తమ కుటుంబాలకు ఆధారంగా ఉన్న డబ్బా కొట్టును తొలగించడంతో ఉపాధి కోల్పోయామని, ఇప్పుడు కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై దాడికి పాల్పడ్డారని ఆంో ఎ ౕ ణ ల ం ఎదుర్కొంటున్న సీఐ తీరుపై ఉన్నతాధికారులు స్పందించాలని బాధితులు డిమాండ్ చేశారు.




ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జీవనోపాధి కోల్పోయిన బాధితులకు న్యాయం చేయడంతో పాటు, సీఐ శివ శంకర్ వ్యవహారశైలి, పోలీసుల తీరు పై కూడా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## అంతులేని కథ నారాయణరావుకి అశ్రునివాళి

**- శ్రీరామ సాంస్కృతిక సంస్థ అధినేత గొర్తి చంద్రశేఖర్**

**రంగారెడ్డి ప్రతినిధి, ఆగస్టు 28 (సూర్య సేన) :** ప్రముఖ నటుడు నిర్మాతజీవీ నారాయణరావు (73) ఇక లేదని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురి అయ్యామని శ్రీరామ సాంస్కృతిక అధినేత గొర్తి చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం నాడు ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నటుడు నిర్మాతజీవీ నారాయణరావు బాల్యం విద్యాభ్యాసం గుంతకల్లులో సాగిందని చిన్న తనంనుండి నాటకాలు నటన అంటే ఆయనకు మక్కువ ఎక్కువ అని పేర్కొన్నారు. గిడుగు విశాలాక్షి వద్ద భరతనాట్యం, నటరాజ రామకృష్ణ వద్ద కూచిపూడి నృత్యం, కృష్ణ వద్ద నటన నేర్చుకున్నారనివిద్యార్థి దశలోనే మహమ్మద్ బిన్ తుగ్లక్ ,ప్రతాప రుద్రీయం,మంచుతెరవంటి పలు నాటకాలు వేసి పలువురితో కలిసి రంగస్థలం వేదికను పంచుకున్నారాయనఅన్నారు.



లి అంతులేని కథతో పరిచయం

నటనపై ఆసక్తితో మద్రాస్ ఫిలిం ఇన్స్టిట్యూట్లోశిక్షణ పొందారు నారాయణరావు అని ప్రముఖ దర్శకుడు కే బాలచందర్ తిరకెక్కించినఅంతులేని కథ సినిమా ద్వారా పరిశ్రమకు పరిచయం అయ్యారని రజనీకాంత్,జయప్రద, శ్రీ ప్రియ, ఫటాఫట్ జయలక్ష్మి ముఖ్యపాత్రలో నటించిన ఈ చిత్రం 1978 ఫిబ్రవరి 27న విడుదల అయిందని మంచి విజయం సాధించిందని ఈ సినిమాలో వికటకవి గోపాల్ పాత్రలో తనదైననటనతోమంచి గుర్తింపు తెచ్చుకున్నారని నారాయణరావుకు తొలి సినిమాకే ఉత్తమ సహాయ నటుడిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి నంది అవార్డు అందుకున్నారనిప్రత్యేకించి ఈ సినిమాలుతాళికట్టుశుభవేళ మెడలోకళ్యాణమాలపాటలు ఆయన నటనకు ప్రశంసలు దక్కాయనిఆ తర్వాత ముత్యాల పల్లకి ఒక ఊరి కథ చిలకమ్మ చెప్పింది ఆలుమగలు గుప్పెడంతమనసు కుక్క కాటుకు చెప్పు దెబ్బ బడాయి బసవయ్యఊరికిచ్చినమాట చట్టానికి కళ్ళు లేవు మంచు పల్లెకి,ప్రళయ రుద్రుడు, బహుదూరపు బాటసారి దేవాంతకుడు,ప్రేమాయణం,యముడికి మొగుడు, ముత్యమంత ముద్దు,రాజా విక్రమార్క, సీతారామయ్య గారి మనవరాలు,గ్యాంగ్ లీడర్, ప్రేమ, చిత్రం,పెళ్లి విచిత్రం, హిట్లర్ ,సాహసం, మహా భక్త సిరియాల,రాజు గారి గది,రెండు, తోలుబొమ్మలాట, వంటి సుమారు 100కు పైగా చిత్రాలలో హీరోగా క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా నటించే ప్రేక్షకులకు దగ్గరయ్యారనినారాయణరావు తెలుగులో ఆయన నటించిన చివరి చిత్రంస్కైలాబ్ 2021 డిసెంబర్ 4న ఈ మూవీ విడుదల అయిందని అన్నారు. తెలుగు ప్రేక్షకులకు ఆత్మీయ మిత్రులు జీవి నారాయణరావు ఇకలేరనివార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని 1976లో అంతులేని కథలో పరిచయమైన ఆయన ఎన్నో చిత్రాలను పలు టెలివిజనసీరియల్లలో తన విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాలలో చెరగని ముద్ర వేశారని నారాయణరావుకు సినీ ప్రేక్షకులతో అనుబంధం ఉందనిదేవాంతకుడు, యముడికి మొగుడు వంటి చిత్రాలను నిర్మించిన నిర్మాతగా సినీ ప్రేక్షకులతో ప్రయాణం చేసిన ఆయన మధుర జ్ఞాపకాలు ఇప్పటికీ జ్ఞాపకం ఉన్నాయని చంద్రశేఖర్ అన్నారు.

# బుద్ధవనం సందర్శన మహా అద్భుతం.... హైకోర్టు న్యాయమూర్తి సామ్ కోషి





**నాగార్జున సాగర్, ఆగస్ట్ 28 (సూర్య సేన) :** నాగార్జునసాగర్ లోని బుద్ధవనం సందర్శన మహా అద్భుతమని ఒకసారి చూస్తే మర్చిపోలేని బౌద్ధ ఆధ్యాత్మిక కేంద్రం అని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి సామ్ కోషి అన్నారు. శుక్రవారం నాగార్జునసాగర్ పర్యటనలో భాగంగా విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న న్యాయమూర్తి దంపతులకు నిడమనూరు కోర్టు న్యాయమూర్తి పృథ్వీరాజ్ పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వీరు నాగార్జునసాగర్ ప్రధాన డ్యామ్ ను, ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని, బుద్ధవనాన్ని సందర్శించారు. బుద్ధవనం సందర్శనలో భాగంగా బుద్ధ పాదాల వద్ద పుష్పాంజలి ఘటించారు. బుద్ధవనంలోని బుద్ధ చరితవనం, జాతకవనం, ధ్యానవనం, స్తూప వనాలను సందర్శించారు. అనంతరం మహాస్తూపం అంతర్భాగంలోని సమావేశ మందిరంలో బుద్ధవనం విశేషాలు తెలిపే లఘు చిత్రాని వీక్షించారు. మహా స్తూపం ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించిన అనంతరం బుద్ధవనం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శాసన, ఎస్టేట్ ఆఫీసర్ రవిచంద్ర లు బుద్ధ వనం కండువాలతో, బ్రోచర్లతో సత్కరించారు. వీరికి స్థానిక టూరిజం గైడ్ సత్యనారాయణ నాగార్జునసాగర్ డ్యాం వివరాలను,బుద్ధవనం విశేషాలను వివరించారు. వీరితోపాటు సాగర్ ఎస్ ఐ సతీష్, ప్రోటోకాల్ ఆఫీసర్ దండ శ్రీనివాస్ రెడ్డి, ఏ ఎస్ ఐ గురునాథం, కోర్టు సిబ్బంది ఖాలీక్ తదితరులు ఉన్నారు.

## శ్రీ సంతోషిమాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి



**- ప్రత్యేక పూజలో పాల్గొన్న పటేల్ రమేష్ రెడ్డి**

**సూర్యాపేట కల్చరల్, ఆగస్టు 28 (సూర్య సేన) :** అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పర్వదినం ప్రజలందరి జీవితాల్లో ఆనందాన్ని నింపాలని ఆకాంక్షించారు. అమ్మవారి కృపతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ మానవతా విలువలను కాపాడుకోవాలని సూచించారు. అమ్మవారి ఆశీస్సులు సూర్యాపేట ప్రజలపై ఎల్లవేళలా ఉండాలని, ప్రజల కుటుంబాలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌన్సిలర్ వెలుగు వెంకన్న, ధరావత్ వెంకన్న, అరవింద్ రెడ్డి, వల్దస్ దేవేందర్, మెగ్య తండ సర్పంచ్ భూక్య రాజు నాయక్, తండు శ్రీను, యాట ఉపేందర్, శ్రీకాంత్, ధర్మ నాయక్, రాజు, దేవాలయ గౌరవ అధ్యక్షులు నూక వెంకటేశం గుప్త, అధ్యక్షులు బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, ప్రధాన కార్యదర్శి పబ్బా ప్రకాశరావు, కోశాధికారి కొత్త మల్లికార్జున్, నరేంద్రుని విద్యాసాగర్ రావు,సోమ శ్రీశైలం బేలిదే అశోక్ ,తాళ్లపల్లి రామయ్య, బ్రాహ్మణపల్లి బాల చంద్రుడు, ముదిరెడ్డి లింగ రెడ్డి బ్రాహ్మణపల్లి శివప్రసాద్ , దేవర శెట్టి సోమయ్య, వందనపు వెంకటేశ్వర్లు నూకా రవి శంకర్ దేవాలయ అర్చకులు బట్టార వంశీకృష్ణ శర్మ, అశోక్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

## శాసనమండలి చైర్మన్ గుత్తాకు బ్రహ్మకుమారి సభ్యులు రక్షాబంధన్...



**నల్గొండ ప్రతినిధి, ఆగస్టు 28 (సూర్య సేన) :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నల్గొండలోని క్యాంపు కార్యాలయంలో తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ని బ్రహ్మకుమారీస్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీస్ సోదరీమణులు గుత్తా సుఖేందర్ రెడ్డి కి రాఖీ కట్టి, రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో సోదరభావం, ప్రేమ, శాంతి, పరస్పర గౌరవం మరింత పెంపొందాలని ఆకాంక్షించారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారికి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో శాంతి, ఆధ్యాత్మిక విలువలు, మానవతా భావాన్ని పెంపొందించేందుకు బ్రహ్మకుమారీస్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

# విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవాలి

లి బడంగ్పేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీ ప్రసాద్

రంగారెడ్డి, ఆగస్టు 28 (సూర్య సేన): నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు విద్యతో పాటు ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాలబడంగ్ పేట ప్రిన్సిపల్ డాక్టర్ సి ప్రసాద్ సూచించారు.

కళాశాలలో కెరియర్ గైడెన్స్ సెల్ ఎన్ఎస్ఎస్ఆధ్వర్యంలో మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ రిలయన్స్ ఫౌండేషన్ కారణంతో బీఎస్సీ బీకాం బిఏవిద్యార్థులకు జీవన ఉపాధి నైపుణ్యాలపై ఓరియంటేషనకార్యక్రమం నిర్వహించారు. మ్యాజిక్ బస్సు ఫౌండేషన్ రిలయన్స్ ఫౌండేషన్ ఇంటర్వ్యూ ప్రిపరేషన్ వ్యక్తిత్వ వికాసం,సమస్య పరిష్కారం లక్ష నిర్ధారణ, డిజిటల్, ఆర్థిక అవగాహన తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ సి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఉద్యోగ మార్కెట్ కు అనుగుణంగా నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలనిఅన్నారు. డాక్టర్ ఎస్ జ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ సామాజిక బాధ్యత సానుకూల దృక్పథాన్నిపెంపొందించుకోవాలని కోరారు .ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ కెరియర్ లక్ష్యాలను ముందుగానే నిర్ధారించుకొని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఐక్యఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామరాజు మాట్లాడుతూ నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్య అభివృద్ధి విద్యార్థులను ఉన్నత విద్యా ఉపాధికి సిద్ధం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది అని తెలిపారు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసింహ రాజు, కామర్స్ నరసింహ మాట్లాడుతూ ఉద్యోగ సాధనలో ఆంగ్లభాష ప్రావీణ్యం కమ్యూనికేషన్ నైపుణ్యాలు వ్యక్తిత్వ



వికాసం ఆత్మవిశ్వాసం ఎంతో ముఖ్యమని వివరించారు. డా. కిరణ్మయి ఫిజిక్స్ విభాగంనింకి మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ ఆలోచన విధానం విశ్లేషణాత్మక నైపుణ్యాలు కొత్త విషయాలను నేర్చుకునే ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరెడ్డి ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ రామరాజు అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# దామోదర్‌రెడ్డి ఆనవాయితీకి కొనసాగింపుగా వేణారెడ్డికి రాఖీలు.....





**- రాఖీ పౌర్ణమి సందర్భంగా మహిళలు వేణారెడ్డికి రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు**

**- కాంగ్రెస్ పార్టీ మహిళలతో సందడిగా మారిన కొప్పుల వేణారెడ్డి గెస్ట్‌హౌస్**

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 (సూర్య సేన) :** జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఉన్న కొప్పుల వేణారెడ్డి గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం రాఖీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మహిళలు ఆయనకు రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి పండగ శుభాకాంక్షలు తెలిపారు. గతంలో దామోదర్‌రెడ్డితో అనుబంధం ఉన్న పలువురు మహిళలు ఆయనను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. అదే ఆత్మీయతతో వేణారెడ్డికి రాఖీలు కట్టడానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వేణారెడ్డి గెస్ట్‌హౌస్ సందడిగా మారింది. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాఖీలు కట్టేందుకు వచ్చిన మహిళలతో వేణారెడ్డి ఆప్యాయంగా ముచ్చటించారు.

# నల్గొండ ప్రభుత్వాస్పత్రిలో గర్భస్థ శిశు మృతి.. విచారణకు కలెక్టర్ ఆదేశం

**- సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై స్పందించిన కలెక్టర్ చంద్రశేఖర్**

**- వైద్యుల నివేదికలో కారణం తెలియని ఊహించని గర్భస్థ శిశు మరణం'గా నిర్ధారణ**

**నల్గొండ టౌన్, ఆగస్టు 28 (సూర్య సేన) :** నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో శుక్రవారం సంభవించిన గర్భస్థ శిశు మరణంపై సోషల్ మీడియాలో వచ్చిన కథనాలపై జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణ నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మెడికల్ సూపరింటెండెంట్ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికను సమర్పించారు. మెడికల్ సూపరింటెండెంట్ నివేదిక ప్రకారం.. ఎ. కవిత అనే 37 వారాల గర్భిణి కడుపునొప్పితో ఈ నెల 27న మధ్యాహ్నం 12.55 గంటల ప్రాంతంలో నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో చేరిన సమయంలో నిర్వహించిన వైద్య పరీక్షల్లో గర్భస్థ శిశువు గుండెచప్పుడు సాధారణంగా ఉన్నట్లు గుర్తించారు.
అదే రోజు మధ్యాహ్నం, రాత్రి, అలాగే 28వ తేదీ ఉదయం వరకు నిరంతరం నిర్వహించిన వైద్య పరీక్షల్లోనూ గర్భస్థ శిశువు గుండెచప్పుడు సాధారణంగానే నమోదైనట్లు నివేదికలో పేర్కొన్నారు. గర్భిణీకి కూడా ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని తెలిపారు. అయితే 28వ తేదీ ఉదయం 6.15 గంటల సమయంలో గర్భంలో శిశువు కదలికలు తగ్గడంతో ఆమెను లేబర్ రూమ్‌కు తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించగా, అల్ట్రాసౌండ్ స్కానింగ్ ద్వారా గర్భస్థ శిశువు గుండెచప్పుడు వినిపించలేదని మెడికల్ సూపరింటెండెంట్ తెలిపారు. వెంటనే ఈ విషయాన్ని గర్భిణి భర్త, కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో పాటు వీడియో కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. గతంలో సిజేరియన్ జరిగిన కేసు కావడం, శిశువు గర్భంలోనే మృతి చెందడంతో గర్భిణీకి ఇబ్బందులు కలగకుండా కుటుంబ సభ్యుల అంగీకారంతో అత్యవసర శస్త్రచికిత్స నిర్వహించినట్లు నివేదికలో తెలిపారు. 28వ తేదీ ఉదయం 7.15 గంటలకు శస్త్రచికిత్స ద్వారా మృత మగ శిశువును బయటకు తీసినట్లు పేర్కొన్నారు.
శస్త్రచికిత్స సమయంలో, అనంతరం కూడా తల్లి ఆరోగ్యం స్థిరంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. గర్భస్థ శిశువు మరణానికి స్పష్టమైన కారణం గుర్తించలేకపోవడంతో దీనిని ఊహించని, కారణం తెలియని గర్భస్థ శిశు మరణం గా నిర్ధారించినట్లు మెడికల్ సూపరింటెండెంట్ తన నివేదికలో పేర్కొన్నారు. ఘటనపై వచ్చిన సోషల్ మీడియా కథనాల నేపథ్యంలో కలెక్టర్ స్పందించి నివేదిక కోరడం, ఆసుపత్రి అధికారులు పూర్తి వివరాలను సమర్పించడం జరిగింది.

# సూర్యాపేట ఉద్యమాలు విఫలమైన చరిత్ర లేదు

**- బుల్లెట్ రైలు సాధన పోరాటానికి బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ సంఘీభావం**

**- 15వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష... రైతు సంఘం ఆధ్వర్యంలో 32 మంది దీక్ష**



**భానుపురి, ఆగస్టు 28 (సూర్య సేన) :** సూర్యాపేటలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన ఉద్యమాలు విజయం సాధించకుండా విఫలమైన సందర్భాలు చరిత్రలో లేవని బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ అన్నారు. సూర్యాపేటకు బుల్లెట్ రైలు సాధన కోసం అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారం 15వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షకు పాదూరి కరుణ సంఘీభావం తెలిపి మాట్లాడారు. సూర్యాపేటకు కొన్ని శతాబ్దాలుగా వాణిజ్య, వ్యాపార రంగాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని, అలాంటి పట్టణాన్ని పాలకులు నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆమె అన్నారు. సూర్యాపేటకు బ్రిటిష్ పాలన కాలంలోనే రైలు సౌకర్యం రావాల్సి ఉన్నప్పటికీ అప్పటి భూస్వాములు, పెత్తందారుల నిరంకుశ వైఖరి కారణంగా అభివృద్ధికి నోచుకోలేదని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైల్వే రంగానికి భారీగా నిధులు కేటాయించి విద్యుదీకరణతో పాటు వేగవంతమైన రైలు ప్రయాణానికి చర్యలు చేపట్టిందన్నారు. శిథిలావస్థలో ఉన్న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధికి రూ. 750 కోట్లు మంజూరు చేసి ప్రపంచస్థాయి సౌకర్యాలతో తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. తెలంగాణకు వచ్చిన బుల్లెట్ రైలు ప్రతిపాదనను సూర్యాపేటకు కాకుండా మరో ప్రాంతానికి మార్చడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం ప్రభుత్వ పథకాలు, ప్రాజెక్టులను వినియోగించాలి తప్ప స్వార్థ ప్రయోజనాలతో నిర్ణయాలు తీసుకుని ప్రజాగ్రహానికి గురికావద్దని పాదూరి కరుణ హెచ్చరించారు. సూర్యాపేట ప్రజలు ఉద్యమం ప్రారంభిస్తే ఫలితం సాధించే వరకు వెనక్కి తగ్గే చరిత్ర లేదని అన్నారు. బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను సూర్యాపేట మీదుగా కొనసాగించేందుకు బీజేపీ తరపున ఎంతవరకైనా పోరాడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న వారికి పాదూరి కరుణ నిమ్మరసం అందించి దీక్షను విరమింపజేశారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా దీక్షలో కూర్చున్న వారికి రాఖీలు కట్టి సోదరభావాన్ని చాటుకున్నారు. ఆమె వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ ఉన్నారు.



రైతు సంఘం ఆధ్వర్యంలో 32 మంది దీక్ష

బుల్లెట్ రైలు సాధన కోసం అఖిలపక్ష పోరాట కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో భాగంగా 15వ రోజు సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో 32 మంది సభ్యులు దీక్షలో పాల్గొన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు మల్లు నాగార్జునరెడ్డి, కాకి శంకర్‌రెడ్డి, దండ వెంకటరెడ్డి, అవిరి అప్పయ్య, కొప్పుల రజిత, వీరబోయిన రవి, నెమ్మది లాజర్, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రామ్‌రెడ్డి, జనార్ధన్‌గౌడ్, కృష్ణారెడ్డి, వీరస్వామి, పుల్లయ్య, వీరారెడ్డి, శేఖర్, యాదయ్య, మోహన్‌రెడ్డి, సర్దార్ కృష్ణ, వెంకన్న తదితరులు దీక్షలో కూర్చున్నారు. దీక్షకు బీఆర్ఎస్ నాయకులు కూడా సంఘీభావం తెలిపారు. ప్రభాకర్‌రెడ్డి, వై. వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, గుర్రం సత్యనారాయణరెడ్డి, జీవన్‌రెడ్డి, జీడీ బిక్షం, నెమ్మది బిక్షం, సాగర్‌రెడ్డి తదితరులు దీక్షా శిబిరాన్ని సందర్శించారు. సీపీఎం నాయకులు వేల్పుల వెంకన్న, జర్నలిస్టు వజ్జే వీరయ్య, కోట గోపి, ఎమ్మెల్యే నాయకులు బుద్ధ సత్యనారాయణ, అఖిలపక్ష నాయకులు రమణాచారి, ధర్మార్జున్, డేవిడ్‌కుమార్, కొత్తపల్లి శివకుమార్, బూర వెంకటేశ్వర్లు, తల్లమల్ల హుస్సేన్, చల్లమల్ల నరసింహ, వెలుగు వనిత, పేర్ల నాగయ్య, భయ్యా మల్లికార్జున్, సట్టు నాగయ్య తదితరులు దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

# సర్వోత్తమ్‌రెడ్డికి రాఖీ కట్టిన నివేదిత లక్షాది

**- రాఖీ పౌర్ణమి సందర్భంగా అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధం చాటుకున్న నాయకులు**



**సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 (సూర్య సేన) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డికి సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. ఈ సందర్భంగా నివేదిత లక్షాది సర్వోత్తమ్‌రెడ్డికి రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సర్వోత్తమ్‌రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగ ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ రాఖీ పౌర్ణమి అని, ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు.

# రైల్వే కారిడార్ కోసం పోరాటానికి బీఆర్ఎస్ సంఘీభావం



**- 15వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్ష.. ఉద్యమానికి ప్రతిరోజూ మద్దతు ప్రకటిస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు**

**- రైతు సంఘం దీక్షా శిబిరాన్ని సందర్శించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి**

**సూర్యాపేట, ఆగస్టు 28 (సూర్య సేన) :** సూర్యాపేటకు రైల్వే కారిడార్ సాధించాలనే డిమాండ్‌తో కొనసాగుతున్న ఉద్యమానికి బీఆర్ఎస్ శ్రేణులు తమ సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. సూర్యాపేటలో రైల్వే కారిడార్ సాధన కోసం సీపీఎం అనుబంధ రైతు సంఘం ఏఐకేఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం 15వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా దీక్షలో పాల్గొన్న రైతు సంఘం నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ నాయకులు సంఘీభావం తెలిపారు. రైల్వే కారిడార్ ఏర్పాటు సూర్యాపేట జిల్లా అభివృద్ధికి ఎంతో కీలకమని, ప్రజల చిరకాల డిమాండ్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిగణనలోకి తీసుకుని తగిన చర్యలు చేపట్టాలని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైల్వే కారిడార్ కోసం జరుగుతున్న ఉద్యమానికి తమ పార్టీ తరఫున ప్రతిరోజూ మద్దతు ప్రకటిస్తామని తెలిపారు. రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సందర్శించి దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలిపారు. సూర్యాపేటకు రైల్వే కారిడార్ సాధించేందుకు ప్రజలు చేస్తున్న పోరాటానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీఏ బసిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, జూలకంటి జీవన్‌రెడ్డి, గుర్రం సత్యనారాయణరెడ్డి, నెమ్మాది బిక్షం, జీడీ బిక్షం, తూడి నర్సింహారావు, ముదిరెడ్డి సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం తెలిపారు. రైల్వే కారిడార్ సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని, అన్ని వర్గాల ప్రజలు ఐక్యంగా పోరాడాలని నాయకులు పిలుపునిచ్చారు.




# నూతనకల్‌లో సీలింగ్ పట్టాల పంపిణీ.. ముగ్గురు మంత్రుల రాక

**- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు**

**సూర్యాపేట, ఆగస్టు 28 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా నూతనకల్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న సీలింగ్ పట్టాల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో కార్యక్రమానికి సంబంధించిన సమాచారాన్ని ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు తెలియజేశారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు నూతనకల్ మండల కేంద్రంలో జరిగే సీలింగ్ పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని కవర్ చేసేందుకు వెళ్లే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వాహనం శనివారం ఉదయం 9:30 గంటలకు సూర్యాపేటలోని పాత కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ వద్ద, కుడకుడ రోడ్డు నుంచి బయలుదేరుతుందని పేర్కొన్నారు. మీడియా ప్రతినిధులు సమయానికి హాజరై వాహన సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.

# అనాథాశ్రమ బాలికల రాఖీ.. కలెక్టర్‌కు ఆత్మీయ వేడుక

**- కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు రాఖీలు కట్టిన చారుమతి అనాథాశ్రమ బాలికలు**

**నల్గొండ, ఆగస్టు 28 (సూర్య సేన) :** అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా ఏటా జరుపుకునే రాఖీ పౌర్ణమి పండుగను పురస్కరించుకుని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ బాలికలతో ఆత్మీయంగా రాఖీ వేడుకలు నిర్వహించారు. రాఖీ పండుగ సోదరికి తన సోదరుడు కలకాలం రక్షగా, తోడుగా ఉంటాననే నమ్మకాన్ని, భరోసాను కల్పించే పవిత్రమైన పండుగ అని కలెక్టర్ అన్నారు. శుక్రవారం రాఖీ పౌర్ణమి సందర్భంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని పానగల్‌లో ఉన్న చారుమతి అనాథాశ్రమానికి చెందిన బాలికలు కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌కు రాఖీలు కట్టారు. బాలికలు ఆప్యాయంగా రాఖీలు కట్టడంతో కలెక్టర్ వారితో కొద్దిసేపు ముచ్చటించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాఖీ పండుగ సోదర, సోదరీమణుల మధ్య ప్రేమానుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు ఎల్లప్పుడూ రక్షగా, తోడుగా



ఉంటామనే భరోసాను కల్పిస్తారని, అదే నమ్మకంతో అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు రక్షాబంధన్ కడతారని తెలిపారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా నల్గొండ జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రేమ, ఆప్యాయత, అనురాగాలతో కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఆకాంక్షించారు.
చారుమతి అనాథాశ్రమ బాలికలతో జరిగిన ఈ ఆత్మీయ రాఖీ వేడుక కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేకంగా నిలిచింది.

# ఓ మనిషి

శ్రమయే నీ ఆయుధం

గెలుపే నీ గమ్యం

మనిషి జీవితం కష్టసుఖాల
సంగమం పనుల ప్రాధాన్యాన్ని
బట్టిఎంపిక చేసుకుంటాడు
కష్టమున్న పనులను పక్కకు నెట్టి
సులభమైన పనులు చేయడానికి
ఆసక్తి చూపుతాడు

ఇష్టమైన సులువైన పనులనే
చేస్తూ కష్టమైన వాటికి దూరంగా
ఉంటే జీవితం బాగుంటుందని
మనిషి భావిస్తాడు కానీ అది
వాస్తవం కాదు

మనల్ని ఉన్నతంగా
తీర్చిదిద్దే పనులు చేయడంలో
ఎన్ని అవాంతరాలు ఎదురైన
వాటిపై ఇష్టం పెంచుకోవాలి
విజయం సాధించాలి
మధ్యలో వదిలి వెళ్ళవద్దు
అప్పుడే జీవితం అద్భుతంగా
మారుతుంది

ఓ మనిషి కష్టమని వెనుకడుగు
వేయకు అప్పుడు ఎక్కడి పనులు
అక్కడే ఆగిపోతాయి

కష్టమైన పనిని ఇష్టంగా మార్చుకో
జీవితం అద్భుతంగా మారుతుంది

భయము నిన్ను పిరికివాన్ని
చేస్తుంది నిరాశ నిస్పృహల్లోకి
నెట్టివేస్తుంది నీ ఆలోచనలకు
కళ్ళెం వేస్తుంది

నీలో పరాధీనతను పెంచుతుంది
సందేహాలు నిన్ను సంక్లిష్టంలోకి
నెట్టుతాయి నేను చేయలేను అనే
నిరశావాధాన్ని పెంచి పోషిస్తుంది

బాధ్యత నిన్ను బలవంతున్ని చేస్తుంది
సవాళ్లను చూసి పారిపోకు యువతా!
సమయంలోనే నీ గెలుపు
దాగి ఉందని గుర్తించుకో
సమయాన్ని పెట్టుబడిగా పెట్టు
పనినే దైవంగ బావించు
అప్పుడు ప్రగతి నీవశమౌతుంది

చెమట చుక్కలు చిందించనిదే
విజయం నీ చెంతకు చేరదు
కఠినమైన మార్గంలో నడవనిదే
గమ్యం నీకు దారి చూపదు

ఓటమి అనేది ముగింపు కాదు
అది అనుభవాలకు పునాది
అది జీవితానికి ఒక కొత్త పాఠం
గుణపాఠం నేర్పుతుంది
శ్రమ వినియోగంలో నైపుణ్యాన్ని
పెంచుతుంది ఉత్పాదకత
ఉపాధి ఆదాయ సృష్టి పెరిగి
మెరుగైన జీవన నాణ్యత
సిద్ధిస్తుంది

కష్టాలను ప్రేమిస్తే
నువ్వే రేపటి చరిత్రకు




ప్రాణం పోస్తావు
లే యువత మేలుకో

నీసంకల్పానికి ఏది సాటి రాదు
ఇష్టపడి శ్రమించు కష్టాన్ని
జయించు స్ఫూర్తి శిఖరమై
నిలువాలి
అప్పుడే ఈ జగత్తు నీకు
సలాం చేస్తుంది

గుర్తుంచుకో యువతరమా
బండరాయి దెబ్బలకు
తట్టుకుంటేనే శిల్పంగా
మారుతుంది

నువ్వు పడే ప్రతి కష్టం
నీ రేపటి అద్భుత విజయానికి
పునాది అవుతుంది ఉన్నత
శిఖరాన్ని అధిరోహించు
ఉజ్వల భవిష్యత్తును చేరుకో

వికసిత భారత్ లక్ష్య
సాధనలో నీవే సారథివై
నిలవాలి ఆత్మనిర్భరతతో
దేశాభివృద్ధిని సాధించాలి

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు తెలంగాణ**
**ఎకనామిక్ ఫోరం**
**రచయిత కాలమిస్ట్**
**హైదరాబాద్ 9440245771**

## సంపాదకీయం

శనివారం, ఆగస్టు 29, 2026

# యువత మెప్పు కోసం మోడీ వ్యూహం

నీట్ పరీక్ష ప్రశ్నపత్రాల లీకేజీపై నిరసనలు సాగించి కాక్రోచ్ జనతా పార్టీ, జెన్‌జెడ్ యువత ప్రభుత్వం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన సంగతి తెలిసిందే. ఈ ఆందోళనల ఫలితంగానే చివరకు కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవిని వదులుకోక తప్పలేదు. అలాగే పాఠశాలల్లోని మౌలిక వసతుల కొరతపై కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమాన్ని సాగిస్తోంది. కాక్రోచ్ జనతా పార్టీని ఆదర్శంగా తీసుకుని దేశం లోని యువత రాజకీయాలకు అతీతంగా పాలక వర్గాల లోపభూయిష్ట విధానాలపై కదంతొక్కడం కాషాయనాథులకు మింగుడుపడడం లేదు. ఎలాగైనా యువతకు చేరువకావాలనే ప్రధాన లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఎప్పటికప్పుడు యువతను బుజ్జగించే సూచనలు చేస్తున్నారు. ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం నాడు ఎర్రకోట వేదికపై ప్రసంగిస్తూ యువతను లక్ష్యంగా చేసుకుని ఉచిత కోచింగ్ సెంటర్ల పథకాన్ని ప్రకటించారు. మళ్లీ ఇప్పుడు గురువారం (27.8.26) దేశ వ్యాప్తంగా విద్యార్థులు, యువతతో వర్చువల్‌గా సంభాషించారు. జాతీయ క్రీడా దినోత్సవం 2026 వేడుకల్లో భాగంగా యువతను ఆకట్టుకునే 'ఖేలో ఇండియా డైలాగ్' ప్రకటించారు. ఈ పథకంలో ప్రతి జిల్లాలో రెండు కళాశాలల్లో అమలు చేయనున్నారు. క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడల్లో శిక్షణ, కోచింగ్ సౌకర్యాలు, స్పోర్ట్ సైన్స్, ఆధునిక క్రీడా సాంకేతికత, క్రీడల్లో అందరికీ సమాన అవకాశాలు, సమగ్ర భాగస్వామ్యం, స్వచ్ఛంద సేవ, శారీరక దారుఢ్యం, దేశ నిర్మాణంలో యువత పాత్ర తదితర ముఖ్యాంశాలతో కూడిన జాతీయ స్థాయి యువజన కార్యక్రమం. మరో ముఖ్య విషయం 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు జనరేషన్ ఆల్ఫా, జనరేషన్ జెడ్ (జెన్ జెడ్) యువతను చేరుకోవడానికి ఎన్నికల కమిషన్ తన ప్రయత్నాలను మరింత ముమ్మరం చేయనుంది. యువతకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించడం, బాధ్యతాయుతమైన ఓటర్లుగా తీర్చిదిద్దడం, ఓటరు అవగాహన కార్యక్రమాలకు వారు నాయకత్వం వహించేలా చేయడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం.

ఇందులో 9 నుంచి 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులు ప్రధాన లక్ష్యంగా ఉంటారు. ఈ కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా 4123 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అమలు చేయాలని ఎన్నికల కమిషన్ సన్నాహాలు చేస్తోంది. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం దేశంలో 1826 సంవత్సరాల వయస్సు గలవారు 14.78 కోట్ల వరకు ఉన్నారు. వీరిలో 7.98 కోట్ల మంది పురుషులు కాగా, 6.79 కోట్ల మంది మహిళలు ఉన్నారు. సుమారు 9000 మంది తృతీయ లింగానికి చెందిన వారు. యువతలో ఎన్నికలపై అవగాహన కల్పించడానికి దేశవ్యాప్తంగా సుమారు 50,000 ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లను ఏర్పాటు చేయాలని ఎన్నికల కమిషన్ ప్రణాళిక రూపొందించింది. ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గంలో సుమారు 10 క్లబ్‌లు ఏర్పాటవుతాయి. అన్ని పాఠశాలల్లోని 912 తరగతుల విద్యార్థులతోపాటు 70,000 కళాశాలలు, 1400 విశ్వవిద్యాలయాల విద్యార్థులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తారు.

ఎలక్టోరల్ లిటరసీ క్లబ్‌లు తొలిసారిగా 2018లో సిస్టమిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలెక్టోరల్ పార్టిసిపేషన్ (ఎస్‌విఇఇపి) కార్యక్రమలో భాగంగా ఏర్పాటైనప్పటికీ ఇప్పుడు ఎన్నికల వ్యూహం దృష్టితో వాటిని సద్వినియోగం చేయాలన్నది ప్రభుత్వ ఎత్తుగడ. విద్యార్థులకు ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియ, ఎన్నికల సంఘం పాత్ర, విధులు, పనితీరుపై అవగాహన కల్పించడమే ఈ క్లబ్‌ల ఉద్దేశం. డిజిటల్ టెక్నాలజీ ఆధారంగా ఈ క్లబ్‌లు చురుకుగా పనిచేస్తాయి. ఇదిలా ఉండగా స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఉపయోగించి విద్యార్థులకు పోటీ పరీక్షలకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ అందించనున్నట్టు ప్రధాని ప్రకటించడం స్వాగతించదగిన పరిణామమే. ఒక కుటుంబం తమ పిల్లల విద్యపై చేసే మొత్తం ఖర్చులో ప్రైవేట్ కోచింగ్ ఖర్చు ప్రస్తుతం 16 శాతంగా ఉంది. 2018లో ఇది 12.5 శాతం మాత్రమే ఉండగా, హయ్యర్ సెకండరీ స్థాయికి చేరుకునే సమయానికి, విద్యార్థులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే కీలక దశలో ఈ ఖర్చు మొత్తం విద్యా బడ్జెట్‌లో దాదాపు నాలుగో వంతుకు చేరుతుంది.

కోచింగ్ చవకగా అందుబాటు లోకి వచ్చినంత మాత్రాన పెద్దగా ప్రయోజనం ఉండదు. ఎందుకంటే నాణ్యమైన ప్రొఫెషనల్ విద్య ఇప్పటికీ కొద్ది సంస్థలకే పరిమితమై ఉంది. ఉదాహరణకు ఈ ఏడాది వైద్య ప్రవేశ పరీక్షకు 20 లక్షలకు పైగా విద్యార్థులు హాజరైనప్పటికీ అండర్ గ్రాడ్యుయేట్ స్థాయిలో అందుబాటులో ఉన్న సుమారు 1.4 లక్షల సీట్లలో, టాప్ 50 కళాశాలల్లో ఉన్న సీట్లు 10,000 కంటే తక్కువే. ఇంజినీరింగ్ కళాశాలల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్ విషయం లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. 2025లో 1519 ఏళ్ల వయసున్న 100 మంది గ్రాడ్యుయేట్లలో కేవలం 26 మందికే రెగ్యులర్ జీతభత్యాల ఉద్యోగం దొరికింది. అందుకనే యువత ఉద్యోగంకోసం సిద్ధమయ్యే దశలోనూ, ఉద్యోగం పొందిన తర్వాత కూడా సమస్యగానే ఉంటోంది.


సూర్యసేన

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు అడ్వర్టైజ్మెంట్స్ మరియు వార్తల కోసం

సంప్రదించండి: 9951241048


# తెలుగు ప్రతిభకు ఘన సత్కారం

## - తెలుగు వెలుగుల పురస్కారోత్సవం









చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఆగస్టు 8, శనివారం రోజున తెలుగు వెలుగుల పురస్కార ప్రధానోత్సవం ఘనంగా, కన్నుల పండువగా నిర్వహించబడింది. ఇట్కా (సమీకృత అంతర్జాతీయ తెలుగు సాంస్కృతిక సారస్వత సంఘం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. విశ్వవిద్యాలయాల కులపతులు, విద్యావేత్తలు, సాహితీవేత్తలు, సామాజిక మరియు రాజకీయ ప్రముఖులు, సినీ, సంగీత, నృత్య కళాకారులు, ఆధ్యాత్మిక సేవామూర్తులు, ప్రముఖ మీడియా ప్రతినిధులు తదితరులను ఈ సందర్భంగా తెలుగు వెలుగుల పురస్కారాలతో సత్కరించారు.

పురస్కార గ్రహీతల్లో డా. ఇనాక్, డా. యెల్లా వెంకటేశ్వరరావు, శ్రీమతి నన్నపనేని రాజకుమారి, డా. ఎల్లూరి శివారెడ్డి, డా. జి.వి. ప్రభాకర్, శ్రీ జె.కె. భారవి, డా. ఎన్. అనంతలక్ష్మి, శ్రీ కంచెర్ల వెంకట రమణ, శ్రీ గౌతమ్ రాజు తదితర ప్రముఖులు ఉన్నారు. అవార్డుల కమిటీ అధ్యక్షులు సంస్కృతి రత్న డా. కె. ధర్మారావు, చైర్మన్ శ్రీ రేలంగి నరసింహారావు, కన్వీనర్ శ్రీ తుమ్మలపల్లి శ్రీరామ సత్యనారాయణ మరియు కమిటీ సభ్యులు పురస్కార గ్రహీతలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. వేద పండితుల ఆశీర్వచనాలతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ప్రముఖులు, అతిథులు ప్రసంగిస్తూ పురస్కారాల ప్రాధాన్యతను, వివిధ రంగాల్లో తెలుగు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ కంచెర్ల వెంకట రమణగారు మాట్లాడుతూ, వివిధ రంగాల్లో విశేష సేవలందిస్తున్న తెలుగు వారిని గుర్తించి, గౌరవ పురస్కారాలతో సత్కరిస్తున్న ఇట్కా కమిటీ అధ్యక్షులు శ్రీ కె. ధర్మారావు గారితో పాటు కమిటీ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా, తానా (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) తన ఆధ్యాత్మిక సేవలను గుర్తించి "విశిష్ట ఆధ్యాత్మికవేత్త" పురస్కారాన్ని ప్రకటించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తానా అధ్యక్షులు శ్రీ తోటకూర ప్రసాద్ గారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి, కళలు, సామాజిక సేవ తదితర రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న ప్రముఖులను ఒకే వేదికపై సత్కరించిన ఈ కార్యక్రమం ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య వైభవంగా కొనసాగింది.

**దేశభాషలందు తెలుగు లెస్స!!**

# ప్రజాసేవే పరమార్థమైన మహాదాత!



చింతలపాటి సీతా రామచంద్ర వరప్రసాద మూర్తిరాజు ప్రముఖ గాంధేయవాది. స్వాతంత్ర్య సమరయోధులు. వందలాది ఎకరాలు దానం చేసిన దాత...సర్వోదయ ఉద్యమానికి చేయూత...ఆరు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక...ఆక్వా పరిశ్రమకు ఆద్యుడు.. విద్యాదాత, అభినవ భోజుడు, గాంధేయవాది, సర్వోదయ నాయకుడు. పశ్చిమ గోదావరి జిల్లా రాజకీయ ప్రముఖుడు. ఆయన కొల్లేరు రాజుగా గుర్తింపు పొందారు. చిన్ననాటనే రాజకీయాల్లో ప్రవేశించి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక య్యారు. 1952 నుంచి 1982 వరకు తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పెంటపాడు నియోజకవర్గాల నుంచి పోటీ చేసి గెలు పొందారు. పీవీ నరసింహారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మార్కెటింగు, గిడ్డంగులు, దేవాదాయ శాఖ మంత్రిగా పని చేశారు. ప్రోటెం స్పీకరుగా కూడా పనిచేశారు. మూర్తిరాజు తణుకు తాలూకా సత్యవాడలో 1919వ సంవత్సరం డిసెంబరు 16వ తేదీన . బాపిరాజు, సూరాయమ్మ దంపతులకు జన్మిం చారు. మగపిల్లలు పుట్టలేదని శ్రీరాముడిని వేడుకుంటూ భద్రా చలం శ్రీరాముని దర్శించారు.. భక్తి ప్రపత్తుల ఫలితంగా పుట్టినందున ఈయనకు సీతారామచంద్ర వర ప్రసాద మూర్తిరాజు అని నామ కరణం చేశారు. మూర్తిరాజుగారి బాల్యం కొంతమేర సత్యవాడలోనే గడిచింది. తరువాత నారాయణ పురంలో ఉండేవారు. ఇంటికి సమీపంలో గోదావరి ఏలూరు కాలువ పక్కనే పాకలు వేయించి, వాటిలో వివేకా నంద మాధ్యమిక పాఠశాలను బాపిరాజు తమ స్వంత యాజమాన్యంలో నిర్వహించేవారు. మూర్తిరాజు ఆ పాఠశాలలోనే మాధ్యమిక విద్య పూర్తిచేసారు. ఎనిమిదవ తరగతి వరకు అక్కడే చదివారు. మిడిల్ స్కూల్లో పిల్లలు ఎవరూ చేరలేదు. ఊరూరు తిరిగి,పాఠశాలను నిలబెట్టడానికి బాపిరాజు చాలా శ్రమించారు. ప్రభుత్వ అనుమతిని కూడా తెప్పించారు. సర్వోదయ ఉద్యమానికి ఊపిరులూదారు. 1955లో వినోభాబావే భూదానో ద్యమంలో భాగంగా జిల్లాకు వచ్చినప్పుడు 100 ఎకరాల భూమిని దానం చేశారు. 1961లో ఉంగుటూరు మండలం నాచు గుంటలో అఖిల భారత సర్వోదయ సమ్మేళనం నిర్వహించారు. విద్యా రంగంపై తిరుగులేని ముద్ర: విద్యా రంగంలో మూర్తిరాజు తనదైన ముద్ర వేశారు. భీమవరం, ఏలూరు నగరాలకే పరిమితమైన విద్యను గ్రామీణ ప్రాంతాలకు తీసుకొచ్చిన ఘనత ఆయనదే. తాను ఎస్ఎస్ ఎల్‌సీ వరకు చదివినా చదువు విలువ గుర్తించి ప్రతి ఒక్కరూ విద్యావంతులను చేయాలనే తపన పడేవారు. బాపిరాజు ధర్మసంస్థ ఏర్పాటు చేసి రాష్ట్ర వ్యాప్తంగా విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. వాటన్నింటికి దేశ నాయకుల పేర్లు పెట్టారు. కుటుంబంలో మహిళ చదువుకుంటే ఆ ఇల్లంతా విద్యావంతులవుతారనేది ఆయన దృఢ విశ్వాసం. అందుకోసం ఆయన జీవితాంతం కృషి చేశారు. కళల్ని సాహిత్యాన్ని ప్రేమించే మూర్తిరాజు కళాకారులకు ఎందరికో ఉపాధి చూపించారు. భూరి విరాళాలిచ్చి అభినవ భోజుడిగా పేరుపొందారు.. నేడు సినీరంగంలో ప్రముఖ హాస్య నటునిగా కొనసాగుతున్న ఎంఎస్ నారాయణ, పురాణ వ్యాఖ్యాత మైలవరపు శ్రీనివాసరావు ఆయన నెలకొల్పిన పాఠశాలల విద్యార్థులే. ప్రముఖ రచయిత, నటులు పరుచూరి గోపాలకృష్ణ ఆయన స్థాపించిన కళాశాలలో అధ్యాప కులుగా పనిచేశారు. మాజీ మంత్రులు దండు శివరామరాజు, మరో మాజీ మంత్రి కంతేటి సత్యనారాయణ రాజులు ఆయన శిష్యులే. శ్వాసకోశ, గుండె సంబంధ వ్యాధులతో 2012 నవంబర్ 12న ఈ లోకాన్ని వదిలి వెళ్లారు. ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచారు. అందునిమిత్తం 40ఎకరాల భూమిని హామీ ఇవ్వ వలసి వచ్చింది.

స్కూల్ లో లక్ష్మీపతి ప్రధానోపా ధ్యాయులుగా, నరసింహాచార్యుల మంచి టీచర్లుగా ఉండేవారు. పాఠాలతోపాటు అనేక విషయాలు చెప్పేవారు. గాంధీ గురించి, ఆయన సిద్ధంతాల గురించి హృదయానికి హత్తుకునేలా చెప్పేవారు. వాస్త వానికి వారివల్ల దేశభక్తి అంటే ఏమిటో, ప్రజాసేవ అంటే ఏమిటొ మూర్తిరాజుకి తెలిసింది. మూర్తిరాజు తన జీవితమంతా ప్రజాసేవకే అంకితం చేశారు. చిన్నతనంలోనే మహాత్మాగాంధీ ప్రభావం ఆయనపై పడి, చివరి వరకు నిజమైన గాంధేయవాదిగానే ఉన్నారు. మహాత్మాగాంధీ దేశ పర్యటనలో భాగంగా 1929లో జిల్లాకు వచ్చినప్పుడు చేబ్రోలు రైల్వేస్టేషనులో ఆయనను చూశారు. అప్పటి నుంచి గాంధీ మార్గంలోనే నడిచారు. గాంధేయ వాదిగా ముద్ర వేసుకొని సత్యం, అహింస, స్వదేశీ విధానాలను తాను ఆచరించడమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వాటికి విశేష ప్రచారం కల్పించారు. మాంసా హారానికి దూరంగా ఉన్నారు. చిన్నతనం నుంచే ఖద్దరు వస్త్రాలను ధరించడం మొదలు పెట్టారు.

అనేక మంది రాజకీయనాయకుల సభలకు హాజరయ్యేవారు. బాబూ రాజేంద్రప్రసాద్, జయప్రకాశ్ నారాయణ తణుకు వచ్చినపుడు, టౌన్ హాల్ లో బహిరంగ సభలు జరిగాయి. వారి ఉపన్యాసాలు మూర్తిరాజుని ఎంతగానో ఆకట్టుకోగా స్నేగితులలో కలిసి విద్యార్థి కాంగ్రెస్ ను ఏర్పాటు చేసారు. ఆయనను అధ్యక్షుడుగా ఉండమన్నారు. కార్యదర్శికి బాధ్యత ఎక్కువ కాబట్టి కార్యదర్శి పదవిని ఎంచుకున్నారు. ముళ్ళ పూడి హరిశ్చంద్రప్రసాద్ ను అధ్యక్షుడుగా చేశారు. విద్యార్థి కాంగ్రెస్ లోని వారంతా ఒకే తరగతిలోని విద్యార్థులు.

కొవ్వలి గోపాలరావు, పుసులూరి కోదండ రామయ్య (ప్లీడరు), పొత్రాప్రగడ శ్రీరామారావు (ప్లీడదు), ముదిగంటి జగ్గన్నా శాస్త్రి మొదలైన నాయకులు తణుకు లోని కోమల విలాస్ దగ్గర గాంధీ బొమ్మ వద్ద సభలు జరిపేవారు.

# పిల్లలలో పఠనాసక్తిని పెంచాలి...



భారత దేశంలో అకడమిక్ లైబ్రరీలతోపాటు, పబ్లిక్ లైబ్రరీలలో అభివృద్ధికి, గ్రంథాలయ వ్యవస్థ వికాసానికి విశేషంగా కృషి చేసిన ఎస్.ఆర్ రంగనాథన్ పుట్టినరోజైన ఆగస్టు 12న జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించి దేశ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. లెక్కల ప్రొఫెసరైన డాక్టర్ ఎస్.ఆర్ రంగనాథన్ 1923లో మద్రాసు యూనివర్సిటీలో లైబ్రేరియన్‌గా చేరాడు. తనకు దొరికిన ఈ అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని గ్రంథాలయ వ్యవస్థకు సంబంధించిన ప్రపంచవ్యాప్త ధోరణులను పరిశీలించి, 1924లో క్లాసిఫికేషన్, 1933లో గ్రంథాలయ కేటలాగుల్ని తయారు చేయడానికి ఒక కొత్త కోడ్‌ను రూపొందించాడు. కోలన్ క్లాసిఫికేషన్ అని పిలిచే ఈ వర్గీకరణ పద్ధతిని దేశంలోని అనేక గ్రంథాలయాలు అనుసరిస్తున్నాయి. పిల్లల్లో పఠనాసక్తిని కలిగించడం, పెంపొందించడం, పిల్లలతో బాటు పెద్దల్ని కూడా బాల సాహిత్యం వైపు ఆకర్షించడం జాతీయ గ్రంథాలయ దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం. చినిగిన చొక్కా అయినా తొడుక్కో...కానీ ఓ మంచి పుస్తకం కొనుక్కో. ఓ మంచి పుస్తకం స్నేహితుడితో సమానం. ఓ మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది' అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పిన మాటలు నేటికి పుస్తక ప్రియుల చెవుల్లో మారు మ్రోగుతూనే ఉంటాయి. కాలం ఎంతగా మారినా పుస్తక ప్రియులకు కొదవేలేదు. సినిమాలు, టెలివిజన్, ఇంటర్నెట్, మొబైల్ ఇతరములు ఎన్ని దరిజేరుతున్నా, పుస్తకం విలువ మాత్రం చెక్కుచెదర లేదు. మానవ మేధస్సును, విజ్ఞానాన్ని పెంచడానికి పుస్తకాలు ఎంతగానో దోహద పడుతున్నాయి.




# టీఎన్జీవో భవనంలో ఘనంగా రక్షాబంధన్...



**నల్లగొండ ప్రతినిధి, ఆగస్టు 28 (సూర్య సేన) :** టీఎన్జీవోస్ భవన్‌లో శుక్రవారం రక్షాబంధన్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా టి ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షుడు నాగిళ్ల మురళి మాట్లాడుతూ రక్షాబంధన్ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక మాత్రమే కాదు. పరస్పర గౌరవం, నమ్మకం, ఆప్యాయత, బాధ్యత, రక్షణకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ. ఉద్యోగుల మధ్య కూడా ఇలాంటి ఆత్మీయత, ఐక్యత, పరస్పర సహకారం మరింత బలపడాలని ఈ వేడుక చాటి చెప్పింది. ఉద్యోగుల కుటుంబంలో రక్షాబంధన్ వంటి పండుగలు పరస్పర అనుబంధాన్ని మరింత పెంపొందిస్తాయని, ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో కూడా ఇదే ఐక్యత, సోదరభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి . శేఖరెడ్డి , మైడి జేరావు, ఆకనూరి లక్ష్మయ్య, కె. మనోజ్ ప్రదీప్, భాస్కర్, కాశిం, రవి నాయక్, రమ్యసుధ, సుమలత, సునీత, విజయ, సుజాత, సుశీల ,లక్ష్మి పద్మ, శశికళ, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా శ్రీ సంతోషిమాత జన్మదిన వేడుకలు



**భానుపురి, ఆగస్టు 28 (సూర్య సేన) :** జిల్లా కేంద్రంలోని శ్రీ సంతోషిమాత దేవాలయంలో రాఖీ పౌర్ణమి సందర్భంగా శ్రీ సంతోషిమాత అమ్మవారి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సంతోషిమాత జన్మదినం సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ అమ్మవారికి తెల్లవారుజామున 108



కలశము లతో అభిషేకం నిర్వహించారు. దేవాలయ కమిటీ సభ్యులు చేపూరి సంతోష్ రామ్ కుమార్ , కీర్తి ప్రియ దంపతులు అమ్మవారికి సమర్పించిన పట్టు వస్త్రాలు అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ ఉత్సవం నిర్వహించారు. భక్తులు ఒకరికి ఒకరు రాఖీలు కట్టుకున్నారు. సంతోషిమాతకు ఉద్యాపన వ్రతం, వడిబియ్యం, మహా పూర్ణాహుతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకొని– వెన్నెల్లో పారాయనం, నామకరణ మహోత్సవం, పవలింపు సేవ కార్యక్రమాలు నిర్వహించి మూడు రోజులుగా జరుగుతున్న జన్మదిన వేడుకలను పరిసమాప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ నూక వెంకటేశం గుప్తా, బ్రాహ్మ0డ్లపల్లి మురళీధర్ పబ్బా ప్రకాశరావు, ఉప్పల రమేష్, యామ వెంకటేశ్వర్లు, దేవరశెట్టి సోమయ్య, తల్లాడ కృష్ణమూర్తి, భక్తులు చల్లా కృష్ణ, చిల్ప అశ్విన్, చల్లా లక్ష్మి కాంత్ దేవాలయ మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వరద బాధితుల కోసం కోదాడలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు....




**– పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో భారంతో ఉపవాస ప్రార్థనలు**

**కోదాడ, ఆగస్టు 28 (సూర్య సేన) :** నేపాల్ దేశంలో ఇటీవల సంభవించిన భీకర ఆకస్మిక వరదల కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఓదార్పు కలగాలని, గల్లంతైన వారు క్షేమంగా బయటపడాలని, బాధితులకు సహాయక చర్యలు వేగవంతం కావాలని కోరుతూ కోదాడ పట్టణ క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కోదాడ పట్టణ క్రైస్తవ నాయకులు పాస్టర్ యేసయ్య ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు నిర్వహించగా, మహిళలు ఉపవాసముండి ప్రత్యేక భారంతో నేపాల్ ప్రజల కోసం ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ యేసయ్య మాట్లాడుతూ నేపాల్‌లో సంభవించిన ఈ విపత్తు ఎంతో బాధాకరమైనది. వరదల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోవడం, అనేక కుటుంబాలు తమ ఆత్మీయులను కోల్పోవడం హృదయాన్ని కలచివేస్తోంది. ఆ దృశ్యాలు చూస్తుంటే మనసు ఎంతో వేదనకు గురవుతోంది. మనం నేరుగా అక్కడికి వెళ్లి సహాయం చేయలేకపోయినా, మన ప్రార్థనల ద్వారా వారి బాధలో భాగస్వాములం కాపాడవచ్చునని అన్నారు. బాధిత కుటుంబాలకు దేవుడు ధైర్యాన్ని ఇవ్వాలని, గల్లంతైనవారు సురక్షితంగా తిరిగి రావాలని, సహాయక బృందాలకు జ్ఞానం మరియు శక్తిని ఇవ్వాలని, నేపాల్ దేశంపై మరింత విపత్తు రాకుండా దేవుడు కాపాడాలని ప్రార్థిస్తున్నాం" అని పాస్టర్ యేసయ్య తెలిపారు. నేపాల్‌లో ఆగస్టు 26న సంభవించిన భీకర వరదలతో ఇళ్లు, రహదారులు, వంతెనలు, ఇతర మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. తాజా అధికారిక నివేదికల ప్రకారం వందలాది మంది ప్రాణాలు కోల్పోగా, ఇంకా అనేక మంది గల్లంతయ్యారు. ప్రార్థనలో పాల్గొన్నవారు. ప్రార్థన కార్యక్రమంలో కోదాడ మిన్సిపాలిటీ మాజీ కో అప్షన్ సభ్యులు శ్రీమతి వంటెపాక జానకి యేసయ్య, పాస్టర్ శ్రీనివాస్ గౌడ్, పాస్టర్ ప్రభుదాస్, గురునాథ్, సుధా జ్యోతి, సరిత, సీత, కవిత తదితరులు పాల్గొన్నారు.

# తరాలు మారినా తరగని అన్నాచెల్లెళ్ల అనుబంధం






**– 98 ఏళ్ల అక్క చేత రాఖీ కట్టించుకున్న 96 ఏళ్ల తమ్ముడు**
**– మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి సోదరీమణుల రాఖీలు.. వేమన్‌రెడ్డికి అక్కాచెల్లెళ్ల ఆప్యాయత**



**నల్గొండ /నార్కట్‌పల్లి, ఆగస్టు 28 (సూర్య సేన) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపాడు గ్రామంలో మూడు తరాల అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధం అపురూప దృశ్యంగా ఆవిష్కృతమైంది. వయసు పెరిగినా.. తరాలు మారినా అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమానురాగాలకు వయసు, కాలంతో సంబంధం లేదని చాటిచెప్పేలా జరిగిన ఈ రాఖీ వేడుక పలువురిని ఆకట్టుకుంది. నాగారం గ్రామ సర్పంచ్, 96 ఏళ్ల గుంటకండ్ల రామచంద్రారెడ్డికి ఆయన 98 ఏళ్ల అక్క అండమ్మ, చెల్లెలు వసంతమ్మ రాఖీలు కట్టి తమ్ముడిపై తమకున్న అపారమైన ప్రేమను చాటుకున్నారు. అనంతరం రామచంద్రారెడ్డి తన సోదరి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వయసు మీదపడినా అన్నాచెల్లెళ్ల మధ్య ఆప్యాయత ఏమాత్రం తగ్గలేదని చాటిచెప్పిన ఈ దృశ్యం అక్కడున్న వారిని కదిలించింది. అదే కుటుంబంలో మరో తరం రాఖీ బంధం కూడా వేడుకకు ప్రత్యేకతను తీసుకొచ్చింది. తెలంగాణ మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి ఆయన సోదరీమణులు భారతమ్మ, రేణుక రాఖీలు కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ఆత్మీయంగా జరుపుకున్నారు. ఇక మూడో తరంలో గుంటకండ్ల జగదీష్‌రెడ్డి తనయుడు వేమన్‌రెడ్డికి ఆయన సోదరీమణులు భావన, లహరి రాఖీలు కట్టి అన్నాచెల్లెళ్ల ప్రేమానురాగాలను చాటుకున్నారు. దీంతో ఒకే కుటుంబానికి చెందిన మూడు తరాల రాఖీ బంధం పల్లెపాడు వేదికగా ఆవిష్కృతమై, చూసినవారికి కన్నుల పండుగగా నిలిచింది. కాలం మారినా.. తరాలు మారినా.. కుటుంబ బంధాలు, అన్నాచెల్లెళ్ల ఆప్యాయతలు మాత్రం తరగవని చాటిచెప్పిన ఈ అపురూప ఘట్టం రాఖీ పౌర్ణమి వేడుకలకు మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. మూడు తరాల ప్రేమానురాగాలను ఒకే వేదికపై చూసిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఈ వేడుకను ఆనందంగా తిలకించారు.

# తమ్ముడికి రాఖీ కట్టిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**రంగారెడ్డి, ఆగస్టు 28 (సూర్య సేన) :** రక్షాబంధన్ పర్వదినం



సందర్భంగా మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి తన తమ్ముడు నరసింహారెడ్డి నివాసంలో రాఖీ కట్టి, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనురాగానికి ప్రతీకగా నిలిచే ఆత్మీయ క్షణాలను పంచుకున్నారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ పండుగ మన కుటుంబ విలువలను, ప్రేమానురాగాలను మరింత బలోపేతం చేస్తుందని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ఈ పవిత్రమైన రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి అక్కాచెల్లెళ్ల జీవితాల్లో అన్నదమ్ముల ప్రేమ, ప్రతి అన్నదమ్ముల జీవితాల్లో అక్కాచెల్లెళ్ల ఆప్యాయత ఎల్లప్పుడూ నిండాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆనందం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రేమకు ప్రతీక... ఆత్మీయతకు చిరునామా... అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్! ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

# డబ్బా కొట్టు తొలగింపుతో పోలీసులకు సంబంధం లేదు: డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి.....

**– ప్రజలకు ఇబ్బంది కలగకుండా పోలీసు విధుల నిర్వహణ**
**– సీఐపై దాడి ఆరోపణల్లో వాస్తవం లేదు.. చట్టప్రకారమే వ్యవహరించామని వెల్లడి**

సూర్యాపేట / కోదాడ, ఆగస్టు 28 (సూర్య సేన): కోదాడ పట్టణంలోని యాదవ బజార్ ప్రధాన రహదారిపై జరిగిన నిరసన, పోలీసులపై వచ్చిన ఆరోపణలపై కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ ఇచ్చారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు విధులు నిర్వర్తించారని తెలిపారు. రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో పలుమార్లు



శాంతియుతంగా రహదారి ఖాళీ చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. కోదాడ పట్టణంలోని 32వ వార్డు యాదవ బజార్ టర్నింగ్ వద్ద మున్సిపాలిటీకి చెందిన స్థలంలో డబ్బా కొట్టు ఏర్పాటు చేసి పాన్‌షాప్ నిర్వహిస్తున్న విషయం పోలీసుల దృష్టికి వచ్చిందని తెలిపారు. సంబంధిత డబ్బా కొట్టును గడ్డం కనకమహాలక్ష్మి, ఆమె భర్త శ్రీనివాస్ సుమారు 20 ఏళ్లుగా వినియోగిస్తున్నట్లు, అందులోని పాన్‌షాప్‌ను ఓబెనబోయిన వీరయ్యకు అద్దెకు ఇచ్చినట్లు సమాచారం ఉందన్నారు. సదరు షాపు ప్రధాన రహదారికి అడ్డుగా ఉండటంతో ప్రజలు, వాహనాల రాకపోకలకు, ముఖ్యంగా ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని చెప్పారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంబంధిత వ్యక్తులకు షాపును తొలగించుకోవాలని సూచించి అక్కడి నుంచి వెళ్లిపోయారని తెలిపారు. 28న తెల్లవారు జామున మున్సిపల్ కమిషనర్, సిబ్బంది అక్కడికి చేరుకుని డబ్బా కొట్టును తొలగించారని చెప్పారు. డబ్బా కొట్టు తొలగింపు పూర్తిగా మున్సిపల్ అధికారుల పరిధిలో జరిగిన చర్యేనని, పోలీసులకు షాపు తొలగింపుతో ఎలాంటి సంబంధం లేదని డీఎస్పీ స్పష్టం చేశారు. పోలీసులు కేవలం శాంతిభద్రతల పరిరక్షణ, అవసరమైనప్పుడు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ బాధ్యతలు మాత్రమే నిర్వర్తించారని తెలిపారు. డబ్బా కొట్టు తొలగింపు అనంతరం గడ్డం కనకమహాలక్ష్మి తన బంధువులతో పాటు మాదాల ఉపేందర్ యాదవ్, తదితరులతో కలిసి యాదవ బజార్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారని పోలీసులు పేర్కొన్నారు. ఉదయం సుమారు 9 గంటల నుంచి 10.30 గంటల వరకు నిరసన కొనసాగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడిందన్నారు. అదే రోజు రక్షాబంధన్ పండుగ కావడంతో కోదాడ పట్టణంలో ప్రజలు, వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నాయని, నిరసన కారణంగా వాహనదారులు, పాదచారులు, సమీప వ్యాపారులు, సాధారణ ప్రజలకు అసౌకర్యం ఏర్పడిందని తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి కోదాడ టౌన్ సీఐ నిరసనకారులపై చేయి చేసుకున్నారని, దౌర్జన్యంగా వ్యవహరించారని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసులు నిరసనకారులకు పలుమార్లు రహదారి ఖాళీ చేయాలని సూచించారని, ప్రజల రాకపోకలను పునరుద్ధరించడం, శాంతిభద్రతలను పరిరక్షించడం కోసమే పోలీసులు జోక్యం చేసుకున్నారని తెలిపారు. సీఐ గానీ, ఇతర పోలీసు అధికారులు గానీ ఉద్దేశపూర్వకంగా నిరసనకారులపై దాడి చేయడం లేదా చేయి చేసుకోవడం జరగలేదని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, మాదాల ఉపేందర్ యాదవ్ సోషల్ మీడియాలో చేసినట్లు పేర్కొన్న అభ్యంతరకర వ్యాఖ్యలపై పాశం శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోదాడ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో క్రైం నంబర్ 434/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఈ నెల 27న ఉపేందర్ యాదవ్‌కు నోటీసు జారీ చేసి, సోషల్ మీడియా పోస్టుకు సంబంధించిన ఆధారాలు, వివరణను 28న సమర్పించాలని కోరినట్లు చెప్పారు. దర్యాప్తుకు సహకరించకుండా ఆయన తన బంధువులు, ఇతరులతో కలిసి ప్రధాన రహదారిపై ధర్నా చేసి ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారని పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు ఒక అంశమైతే, ప్రజా రహదారిపై ఏర్పడిన ట్రాఫిక్ అంతరాయాన్ని తొలగించడం మరో అంశమని డీఎస్పీ స్పష్టం చేశారు. ఇరువిషయాల్లోనూ పోలీసులు చట్టప్రకారం, నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. కోదాడ పట్టణ ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రజల భద్రత, ప్రజా రహదారులపై సాఫీగా రాకపోకలు, శాంతిభద్రతల పరిరక్షణకు కోదాడ సబ్‌డివిజన్ పోలీసులు నిరంతరం కట్టుబడి ఉంటారని స్పష్టం చేశారు.

# పటేల్ రమేష్‌రెడ్డికి రాఖీ కట్టిన మంత్రి సీతక్క



**– కొండాపూర్‌లోని రమేష్‌రెడ్డి నివాసంలో ఆత్మీయంగా రక్షాబంధన్ వేడుకలు**

**హైదరాబాద్, ఆగస్టు 28 (సూర్య సేన) :** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హైదరాబాద్ కొండాపూర్‌లోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క పటేల్ రమేష్‌రెడ్డికి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.



రాఖీ కట్టిన అనంతరం ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ సందర్భంగా ఈ ఆత్మీయ కలయిక జరిగింది. మంత్రి సీతక్క రమేష్‌రెడ్డికి రాఖీ కట్టిన సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితుల్లో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. కుటుంబసభ్యుల అనుబంధాన్ని తలపించేలా ఈ ఆత్మీయ భేటీ సంతోషకరంగా సాగింది.

# బోనాల పండుగకు సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతు భాస్కర్‌కు ఆహ్వానం



**– ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలకు హాజరు కావాలని దేవస్థానం కమిటీ సభ్యుల విజ్ఞప్తి**

**సూర్యాపేట టౌన్, ఆగస్టు 28 (సూర్య సేన) :** సూర్యాపేట పట్టణంలోని తాళ్లగడ్డలో ఈ నెల 30న నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ ఇంద్రవెల్లి ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగకు హాజరుకావాలని రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్‌ను దేవస్థానం కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా దేవస్థానం కమిటీ సభ్యులు పోతు భాస్కర్‌ను కలిసి బోనాల పండుగకు సంబంధించిన వివరాలను తెలియజేసి, వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్న ఈ బోనాల పండుగకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్లు దేవస్థానం కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

# సూర్యాపేటకు బుల్లెట్ రైలు కావాలి...

పల్లవి:
సూర్యాపేటకు బుల్లెట్ రైలు కావాలి...
మన సూర్యాపేటకు కొత్త వెలుగు రావాలి!
వేగం పెరగాలి... అభివృద్ధి జరగాలి,
మన జిల్లా పేరు దేశమంతా మార్మోగాలి!



చరణం 1:
వ్యాపారానికి ఊపిరై,
యువతకు అవకాశమై,
విద్యా ఉద్యోగాలకు కొత్త దారై,
హైదరాబాద్--విజయవాడ మార్గంలో
సూర్యాపేటకు బుల్లెట్ రైలు రావాలి!
చరణం 2:
రైతన్నకు మార్కెట్ చేరువ కావాలి,
పరిశ్రమలకు కొత్త ఊపిరి రావాలి,
ప్రజల ప్రయాణం సులభం కావాలి,
సూర్యాపేట అభివృద్ధి పరుగులు తీయాలి!
చరణం 3:
మన గొంతు ఒక్కటై నినదించాలి,
మన హక్కు కోసం ముందుకు సాగాలి,
ప్రజల కలను నిజం చేసే వేళ ఇది,
సూర్యాపేటకు బుల్లెట్ రైలు కావాలి!
ముగింపు పల్లవి:
బుల్లెట్ రైలు రావాలి... రావాలి!
సూర్యాపేట పేరు వెలగాలి... వెలగాలి!
అభివృద్ధి బాటలో ముందుకు సాగాలి,
మన సూర్యాపేట మరింత ఎత్తుకు ఎదగాలి!

# ఆత్మీయ అనుబంధాల రాఖీ పండుగ....



**– ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు**

**పెన్ పహాడ్, ఆగస్టు 28 (సూర్య సేన) :** అక్కచెల్లెళ్ల అన్నదమ్ముల ఆత్మీయత అనురాగాల వేడుక రక్షాబంధన్ (రాఖీ పండుగ)ను మండల వ్యాప్తంగా శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఏటా శ్రావణమాసంలో పౌర్ణమి రోజున రాఖీ పండుగను జరుపుకోవడం సాంప్రదాయంగా వస్తుండగా ఆడపడుచులు ఆప్యాయంగా అన్నతమ్ముళ్లకు రాఖీలు కట్టి మురిసిపోయారు. ఈ నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన ఒగ్గు ఆకాంక్ష తన సోదరుడు ఒగ్గు అఖిల్ కుమార్ కు అదే విధంగా నీలకంఠం లీలావతి తమ సోదరుడు నీలకంఠం వీరేంద్రనాథ్, అర్రూరి వరుణ్ తేజ్, నందకిశోర్ లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించి, ఆశీర్వదించి తమ ఆత్మీయ బంధాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పెద్దలు మాట్లాడుతూ అన్నా చెల్లెలు అక్క తమ్ముళ్ల మధ్య రక్షణ బంధాన్ని ఏర్పరిచే రాఖీ పండుగ కుటుంబ వ్యవస్థను పటిష్టం చేస్తుందన్నారు. ప్రతి సోదరుడు సోదరీమణి జీవితాంతం ప్రేమానురాగాలతో జీవించాలని ఆకాంక్షించారు. పండగ సందర్భంగా మండల వ్యాప్తంగా ఏర్పాటుచేసిన రాఖీ దుకాణాలు, మిఠాయి షాపులు మహిళలతో కిటకిటలాడాయి. తమ సోదరులకు రాఖీలు కట్టిన పలువురు మహిళలు ప్రజా ప్రతిభ తో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

# కమలం పార్టీకి పొలిటికల్ స్పేస్.....

**హైదరాబాద్, ఆగస్టు 28 (సూర్య సేన) :** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణం నెలకొంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌కు అధికారమిచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో ఎదుర్కొంటున్న సవాళ్లు, అంతర్గత విభేదాలు, పరిపాలనాపరమైన ఇబ్బందులతో ప్రజల్లో కొంత అసంతృప్తి మొదలవుతోంది. ఇటు బిఆర్ఎస్ ప్రాభవం కోల్పోతుండటం, అటు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెరుగుతుండటంతో.. కమలం పార్టీకి స్పష్టమైన పొలిటికల్ స్పేస్ లభించింది. కానీ, ఈ సువర్ణ అవకాశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకోవడంలో తెలంగాణ బీజేపీ తీవ్రంగా తడబడుతోంది .మీరు కేసీఆర్ పదేళ్ల పాలన చూశారు, కాంగ్రెస్ మార్పు పాలననూ చూస్తున్నారు.. ఒక్కసారి కమలానికి అవకాశం ఇవ్వండి అనే బలమైన నినాదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో బీజేపీ విఫలమవుతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీ స్థానాలు గెలుచుకుని సత్తా చాటినప్పటికీ, ఆ ఉత్సాహాన్ని రాష్ట్ర స్థాయి అధికారం దిశగా మళ్లించే సమిష్టి వ్యూహం క్షేత్రస్థాయిలో కనిపించడం లేదు. కేవలం ఢిల్లీ పెద్దల ఇమేజ్, మోదీ చరిష్మాపైనే ఆధారపడటం తప్ప.. స్థానిక నాయకత్వం ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని నింపలేకపోతోంది. కేవలం ప్రత్యర్థి పార్టీల వైఫల్యాలను ఎత్తిచూపడం మాత్రమే సరిపోదు. తాము అధికారంలోకి వస్తే ఏం చేస్తామనే ప్రణాళికను దాన్ని నడిపించే ఒక ఫేస్ ను చూపిస్తేనే ప్రజలు జాతీయ పార్టీలకు ప్రాంతీయ స్థాయిలో ఓటేస్తారని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. తెలంగాణ బీజేపీకి ఉన్న ప్రధాన లోపం.. స్పష్టమైన సీఎం ఫేస్ లేదా తిరుగులేని ఒకరిద్దరు బలమైన నాయకులు లేకపోవడం . గతంలో బండి సంజయ్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అగ్రెసివ్ హిందూత్వ, నిరసనలతో కేడర్‌లో పీక్ లెవెల్ జోష్ ఉండేది. ఆ తర్వాత జి. కిషన్ రెడ్డి, ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అరవింద్ వంటి అగ్రనేతలు ఉన్నప్పటికీ.. ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా గ్రూపు రాజకీయాలు సాగుతున్నాయనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. నాయకుల మధ్య సమన్వయ లోపం వల్ల అధికార కాంగ్రెస్‌పై లేదా ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై ఒక్కటిగా దాడి చేయలేకపోతున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని దీదీ కోటను బద్దలు కొట్టడానికి బీజేపీ ఎలాగైతే అగ్రెసివ్ కేడర్ పాలిటిక్స్ చేసిందో, తెలంగాణలోనూ అలాంటి







బెంగాల్ తరహా పోరాట వ్యూహం అవసరమనేది పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయం. అక్కడ కమలం పార్టీ ప్రతీ పంచాయతీ, ప్రతీ వార్డు స్థాయి వరకు వెళ్లి కేడర్‌ను నిర్మించి, అధికార పార్టీ దాష్టీకాలను ధైర్యంగా ఎదుర్కొంది. కానీ తెలంగాణలో ప్రెస్ మీటింగ్లు, కరపత్రాల పంపిణీ, ఢిల్లీ పర్యటనలకే పరిమితమవుతున్నారు తప్ప.. ప్రజల తరఫున సుదీర్ఘకాలం పాటు రోడ్డెక్కి పోరాడే పాదయాత్రలు, ధర్నాలు కరువయ్యాయి. బీజేపీ పై సామాన్య ప్రజల్లో ఉన్న మరో అనుమానం.. బీఆర్ఎస్ – బీజేపీ ఒకటేనా? అనే పాత ప్రచారం. ఈ నెగెటివ్ ఇంప్రెషన్‌ను పూర్తిస్థాయిలో తుడిచిపెట్టేలా బీజేపీ గ్రౌండ్ లెవెల్‌లో నమ్మకాన్ని కలిగించలేకపోయింది. తెలంగాణలో బీజేపీకి అధికారం దక్కాలంటే తక్షణమే కొన్ని విప్లవాత్మక మార్పులు అవసరం. పార్టీలోని గ్రూపు తత్వాలకు స్వస్తి చెప్పి, ఒక సమర్థవంతమైన, మాస్ ఇమేజ్ ఉన్న నాయకుడిని ముందు పెట్టి నడిపించాలి. ప్రజల నిత్య జీవిత సమస్యలైన రుణమాఫీ, ఉపాధి, రైతు భరోసా, మౌలిక వసతులపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ నిరంతరం ప్రజల్లో ఉండేలా కార్యాచరణ రూపొందించుకోవాలి. ఈ అవకాశాన్ని వదులుకుంటే మళ్లీ కోలుకోవడం తెలంగాణ బీజేపీకి సాధ్యం కాకపోవచ్చు.

# శంకుస్థాపనకే పరిమితమైన బ్రిడ్జి

**– 52 కోట్ల ప్రాజెక్టు.. మూడు సంవత్సరాలుగా ముందుకు సాగని నిర్మాణ పనులు**

**రంగారెడ్డి, ఆగస్టు 28 (సూర్య సేన) :** నాగోల్ – పత్తుల్లా గూడా నుంచి పీర్జాదిగూడ వైపు నేరుగా రాకపోకలకు వీలుగా మూసీ నదిపై ప్రతిపాదించిన నాలుగు లైన్ల హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం శంకుస్థాపనకే పరిమితమైంది. ఈ ప్రాజెక్టు 2023 సెప్టెంబర్ 25న అప్పటి పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు శంకుస్థాపన చేశారు. అయితే మూడు సంవత్సరాలు దాటిన నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతుంది. వంతెన పూర్తి అయితే నాగోల్ బండ్లగూడ పతుల్లా కూడా నుంచి పీర్జాది కూడా బోడు ఉప్పల్ ప్రాంతాలకు రాకపోకలు సులభం కానున్నాయి ముఖ్యంగా వరంగల్ యాదాద్రి భువనగిరి ఘట్కేసర్వైపు వెళ్లే వాహనదారులకు ప్రయాణ దూరం సమయం ఇందన వ్యయం తగ్గే అవకాశం ఉంటుంది.



**– మూడేళ్లుగా ముందడుగు ఏది?**

శంకుస్థాపన అనంతరం నిర్మాణ ప్రదేశంలో శాశ్వత పనులు కాకపోవడం స్థానికులను నిరాశకు గురిచేస్తుంది ప్రస్తుతం ఏ దశలో ఉంది టెండర్లు పూర్తయ్యాయ భూసేకరణ లేదా అనుమతులు సమస్యలు ఉన్నాయా నిధులు అందుబాటులో ఉన్నాయా లేదా అనే అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

**– ఓ ఆర్ ఆర్ చుట్టూ తిరిగే పరిస్థితికి చెక్**

ప్రస్తుతం నాగోల్ బండ్లగూడ పరిసరాలు నుంచి పీర్జాదిగూడ వైపు వెళ్లేందుకు వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయిస్తున్నారు. మూసీ నదిపై నేరుగా వంతెన అందుబాటులోకి వస్తే ప్రయాణ దూరంలో గణనీయంగా తగ్గడంతో పాటు తూర్పు హైదరాబాదులోని పలు ప్రాంతాల మధ్య కూడా అనుసంధానం మెరుగవుతుంది నాగోలు పత్తుల్లా కూడా బండ్లగూడ పీర్జాదిగూడ బోడు ఉప్పల్ ప్రాంతాలలో జనాభా వాహనాల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈ వంతెన అవసరం మరింత పెరిగిందని స్థానికులు చెబుతున్నారు. లింకు రోడ్ల పనులకు అనుసంధానంగా వంతెనను పూర్తి చేస్తే ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంటున్నారు.

**– ప్రభుత్వం స్పందించాలి**

శంకుస్థాపన చేసి హామీ ఇవ్వడం కాకుండా ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు మూసి ఈసీ నదులపై వంతెనల నిర్మాణానికి గతంలో రూపొందించిన ప్రణాళికలో భాగమైన ఈ ప్రాజెక్టుపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలి అడ్డంకులు తొలగించి పనులు ప్రారంభించాలని కోరుతున్నారు. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న వంతెన శంకుస్థాపన ఫలకానికే పరిమితం కాకుండా ప్రజల ప్రయాణ కష్టాలను తీర్చే వాస్తవిక వంతెనగ మారాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.


# స్థానిక ఎన్నికల్లో వైసిపి వారసులు..

**గుంటూరు,ఆగస్టు 28 (సూర్య సేన) :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్లలో ఒకరకమైన బెంగ కనిపిస్తోంది. వారికి పార్టీ భవిష్యత్ కంటే.. తమ పిల్లల భవిష్యత్తును సెట్ చేయడమే ఒక కర్తవ్యంలా మారింది. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితి చూస్తే ఏమంత బాగాలేదు. పైగా అధినేత జగన్మోహన్ రెడ్డి వైఖరి గురించి వారికి తెలియనిది కాదు. అందుకే ఎక్కువ మంది ఇప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలపై ఫోకస్ పెడుతున్నారు. అక్కడ పార్టీ పరిస్థితి మెరుగుపడిందా? పర్వాలేదు. లేకుంటే పార్టీని వదిలి సేఫ్ జోన్ లో తమ వారసులను నిలపాలన్న ఆలోచనతో ఉన్నట్లు కనిపిస్తోంది. 2029 ఎన్నికలు దాటితే చాలామంది ఏడుపదుల వయసు దాటుతారు. అప్పటికి తమ వారసుల రాజకీయ భవిష్యత్తు సెట్ అవుతుందా? లేదా? అనే అనుమానంతో ఉన్నారు. ప్రస్తుతం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నేతలుగా ధర్మాన బ్రదర్స్, బొత్స సత్యనారాయణ, తమ్మినేని సీతారాం లాంటి నేతలు ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లోనే తమ పిల్లలకు టికెట్లు ఇవ్వాలని ధర్మాన బ్రదర్స్ కోరారు. కానీ అందుకు జగన్ అంగీకరించలేదు. అయితే ఇప్పుడు 2029 ఎన్నికల వరకు వేచి చూసే కంటే.. స్థానిక ఎన్నికల్లోనే తమ పిల్లలను బరిలో దించాలని ధర్మాన బ్రదర్స్ చూస్తున్నట్లు తెలుస్తోంది. ధర్మాన కృష్ణ దాస్ కుమారుడిని జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. ధర్మాన ప్రసాదరావు కుమారుడ్ని శ్రీకాకుళం నగరపాలక సంస్థ మేయర్ గాను



రంగంలోకి దించాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో అక్కడ వచ్చే ఓట్ల ప్రభావం, ఫలితాలను అంచనా వేసుకుని 2029 ఎన్నికల నాటికి ఏదో ఒక రాజకీయ నిర్ణయం తీసుకోవాలన్నది ధర్మాన బ్రదర్స్ ఆలోచనగా తెలుస్తోంది. శాసనమండలిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పక్ష నాయకుడిగా ఉన్నారు బొత్స సత్యనారాయణ. ప్రస్తుతం ఆయన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. అయినా సరే పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. దానికి కారణం వారసులను రాజకీయంగా సెట్ చేయడమే. కుమార్తెతో పాటు కుమారుడు ఇద్దరూ వైద్యులే. కానీ ఇంతవరకు వారు పొలిటికల్ గా సెట్ కాలేదు. అందుకే తన కుమార్తె డాక్టర్ అనూషను జిల్లా పరిషత్ చైర్మన్ గాను.. కుమారుడు సందీప్ ను చీపురుపల్లి ఎమ్మెల్యే గారు చూడాలనుకుంటున్నారు బొత్స. ఇప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో తన కుమార్తె పేరును జిల్లా పరిషత్ చైర్పర్సన్ పదవి కోసం జగన్ ఎదుట ప్రతిపాదన పెట్టారు. మరోవైపు తాను ఎంపీగా పోటీ చేయాలనుకుంటే తన కుమారుడికి జిల్లా పరిషత్ పదవి ఇవ్వాలని కోరుతున్నారు తమ్మినేని.

# సీఎం రేవంత్‌రెడ్డికి రాఖీ కట్టిన పటేల్ లావణ్య రమేష్ రెడ్డి



**– ఘనంగా జూబ్లీహిల్స్ నివాసంలో రాఖీ పౌర్ణమి వేడుకలు**

**హైదరాబాద్, ఆగస్టు 28 (సూర్య సేన) :** రాఖీ పౌర్ణమి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డికి మాజీ తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి సతీమణి పటేల్ లావణ్య రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా లావణ్య రాఖీ కట్టి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమం ఆత్మీయంగా సాగింది. రాఖీ పండుగ కుటుంబ బంధాలు, ప్రేమానురాగాలు, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.

# పాకిస్తాన్ ఐఎస్ఐ కోసం పని చేస్తున్న భారతీయ జంట.. ఢిల్లీలో అరెస్ట్



**న్యూఢిల్లీ,ఆగస్టు 28 (సూర్య సేన) :** పాకిస్తాన్ కోసం గూఢచర్యం చేస్తున్న దంపతుల్ని ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పోలీసులు కీలక వివ రాలు రాబట్టారు. అరెస్టైన జంటను మొహమ్మద్ సాహిల్, అతడి భార్య సమీరగా గుర్తించారు. వీరి అరెస్టుకు సంబంధించిన వివరాల్ని పోలీసులు శుక్రవారం వెల్లడించారు. సాహిల్, సమీర జంట ఢిల్లీలోని సరాయ్ కాలే ఖాన్ ప్రాంతంలో ఉంటున్నారు. సాహిల్ 2001లో ఉత్తర ప్రదేశ్‌లోని బదాయున్ ప్రాంతానికి చెందినవాడు. అతడు త్వరలో ఎల్ఎల్బీ చది వేందుకు ప్లాన్ చేసుకున్నాడు. 2005లో బిజ్నూర్‌కు చెందిన సమీర ఇంటర్ పూర్తి చేసింది. వీరిద్దరూ కొంతకాలంగా పాకిస్తాన్‌కు చెందిన నిఘా సంస్థ ఐఎస్ఐ (ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్) సంస్థతో కలిసి పని చేస్తున్నారు. భారతీయ నిఘా వ్యవస్థలు అందించిన సమాచారం ఆధారంగా నార్తర్న్ రేంజ్ ఆఫ్ ద స్పెషల్ సెల్ పోలీసులు ఈ దంపతుల్ని అరెస్టు చేశారు. సాహిల్ 2024 నుంచి పాకిస్తాన్ కోసం పనిచేస్తున్నాడు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా అక్కడి వారిని సంప్రదిస్తుంటాడు. ఈ జంట ఇక్కడ ఎనిమిది సిమ్ కార్డులు కొని, దుబాయ్ ద్వారా పాకిస్తాన్ పంపింది.

# నేపాల్ వరదలు.. కొట్టుకొచ్చిన బంగారం, వెండి, డబ్బులు..



**న్యూఢిల్లీ, ఆగస్టు, 28 (సూర్యసేన ప్రతినిధి):** భారీ వర్షాలు, ప్రళయకారక వరదలతో నేపాల్ తీవ్రంగా విలవిలలాడుతోంది. కొండచరియలు విరిగిపడి, నదులు ఉప్పొంగడంతో వందలాది ఇళ్లు, మౌలిక వసతులు వరద నీటిలో కొట్టుకుపోయాయి. అనేక ప్రాంతాల్లో జనాలు తమ సర్వస్వాన్ని కోల్పోయి వీధిన పడ్డారు. ఇలాంటి విపత్తు సమయంలో విపరీతమైన నష్టం, ప్రాణనష్టం వాటిల్లుతుండగా, మానవత్వంలోని రెండు విభిన్న కోణాలు బయటపడ్డాయి. ఒకవైపు వరద ప్రవాహంలో కొట్టుకొచ్చిన ఓ మహిళ మృతదేహం నుంచి కొందరు ఆభరణాలను దొంగిలించిన దారుణ ఘటన కలకలం రేపింది. నారాయణి నది ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహం నుంచి కొందరు దుండగులు బంగారు కమ్మలను దొంగిలించగా.. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమవ్వగా.. ఆ ఘటనకు కారణమైన ఇద్దరు వ్యక్తులను నేపాల్ పోలీసులు వెనువెంటనే అరెస్టు చేశారు. అయితే ఇదే సమయంలో మానవత్వాన్ని చాటిచెప్పే మరొక సంఘటన వెలుగుచూసింది. త్రిశూలి నది వరద ఉధృతికి మట్టితో కూడిన ఒక కబోర్డ్ కొట్టుకొచ్చింది. నిర్మల్ పర్సాయి అనే యువకుడు, అతని స్నేహితులు ఆ కబోర్డును తెరిచి చూడగా.. అందులో పెద్ద మొత్తంలో బంగారం, వెండి ఆభరణాలతో పాటు నగదు లభించింది.

# నాలుగు భారత కంపెనీలపై అమెరికా ఆంక్షలు



ఇరాన్ నుంచి చట్టవిరుద్ధంగా పెట్రోలియం, పెట్రోకెమికల్ ఉత్పత్తులను దిగుమతి చేసుకున్నారనే ఆరోపణలతో భారత్‌కు చెందిన నాలుగు కంపెనీలతో పాటు వాటి ప్రతినిధులపై అమెరికా విదేశాంగ శాఖ తీవ్ర ఆంక్షలు విధించింది. 'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' ప్రచారంలో భాగంగా యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. టెహ్రాన్‌కు లభించే ఆర్థిక మద్దతును పూర్తిగా నిలిపివేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ చర్యలో కస్టమ్స్ బ్రోకర్ సంస్థ పోర్టేజ్ పార్ట్‌నర్స్ ఎల్ఎల్‌పీ, సదాశివ ఓవర్సీస్ లిమిటెడ్, పీపీ సాఫ్ట్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రా ఇంపెక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఉన్నాయి. వీటితో పాటు భారత మూలాలున్న ఇంద్రిస్మియా అష్రఫ్మియా షేక్, హరీష్ రామచంద్ర రంగి, ప్రశాంత్ గార్గ్‌లను కూడా అమెరికా బ్లాక్‌లిస్ట్‌లో ఉంచింది. అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ వెల్లడించిన వివరాల ప్రకారం సదాశివ ఓవర్సీస్ సుమారు 69 మిలియన్ డాలర్లు, పీపీ సాఫ్ట్‌టెక్, ప్రకృతిస్ ఇన్‌ఫ్రాలు చెరో 25 మిలియన్ డాలర్ల విలువైన ఇరాన్ పెట్రోలియం ఉత్పత్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారణ అయింది. ఇరాన్‌తో వ్యాపార సంబంధాలను తక్షణమే నిలిపివేయాలని, లేకపోతే తీవ్రమైన ద్వితీయ ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని అంతర్జాతీయ వ్యాపార సంస్థలను అమెరికా హెచ్చరించింది.


'ఆపరేషన్ ఎకనామిక్ అవుట్‌కాస్ట్' ప్రచారంలో భాగంగా యూఎస్ ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ నిర్ణయాన్ని ప్రకటించారు.

## ఈజెనెసిస్‌లో రూ.133 కోట్ల పెట్టుబడులు

అమెరికా బయోటెక్నాలజీ సంస్థ ఈజెనెసిస్ ఇంక్.లో అదనంగా రూ.133 కోట్ల (1.4 కోట్ల డాలర్ల) పెట్టుబడిని నాట్కో ఫార్మా పెట్టనుంది. ఇందులో నాట్కో ఫార్మా కెనడా ఇంక్ 95 లక్షల డాలర్లు, నాట్కో ఫార్మా సౌత్ ఆఫ్రికా ప్రొప్రైటరీ లిమిటెడ్ 45 లక్షల డాలర్ల చొప్పున పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ మొత్తాన్ని కన్వర్టబుల్ ప్రామిసరీ నోట్ల రూపంలో సమకూర్చనున్నట్లు నాట్కో తెలిపింది. 2024లో ప్రిఫర్డ్ స్టాక్ రూపంలో ఈజెనెసిస్‌లో 80 లక్షల డాలర్ల పెట్టుబడిని నాట్కో ఫార్మా పెట్టింది. తాజా పెట్టుబడితో కలిపి నాట్కో మొత్తం పెట్టుబడి రూ.210 కోట్లకు చేరనుంది. అవయవ మార్పిడికి ఊతం ఇచ్చేలా: ప్రపంచవ్యాప్తంగా అవయవ దానానికి కొరత ఉన్న దృష్ట్యా సురక్షితం–సమర్థమైన అవయవాల అభివృద్ధిపై ఈజెనెసిస్ పరిశోధనలు చేస్తోంది. మనుషులకు ఇతర జీవుల అవయవాలు అమర్చేటప్పుడు ఎదరయ్యే కణ అసమతుల్యతలను, వైరస్ ముప్పును జన్యు ఇంజినీరింగ్ ద్వారా పరిష్కరించే సాంకేతికతను ఈ సంస్థ అభివృద్ధి చేస్తోంది. 'ఈజెనెసిస్ జీనోమ్ ఇంజినీరింగ్ అండ్ ప్రొడక్షన్' పేరుతో పిలిచే ఈ పరిశోధన ద్వారా, ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు కొత్త జీవితాన్ని ప్రసాదించేందుకు వీలవుతుందని నాట్కో తెలిపింది. విశాఖపట్నంలో ఉన్న నాట్కో ప్లాంటులో ఈనెల 17- 21 తేదీల్లో యూఎస్ఎఫ్‌డీఏ తనిఖీలు నిర్వహించి, 4 అభ్యంతరాలతో ఫామ్ 483 నోటీసును జారీ చేసింది. అవి విధానపరమైనవేనని నాట్కో పేర్కొంది.




## ఈపీఎఫ్ఓ, ఐటీఆర్ డేటాపై ప్రైవేట్ సంస్థల యాక్సెస్



ప్రావిడెంట్ ఫండ్ (ఈఓఈఫ్ఓ), ఆదాయపు పన్ను (ఐటీఆర్) రికార్డుల్లోని అత్యంత సున్నితమైన సమాచారాన్ని ప్రైవేట్ సంస్థలు సులువుగా పొందడం, వాణిజ్య ప్రయోజనాల కోసం వాడుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పీయూష్ శర్మ దాఖలు చేసిన పిఐఎల్‌ను విచారిస్తూ.. ప్రజలు చట్టప్రకారం ప్రభుత్వానికి సమర్పించిన డేటా ప్రైవేట్ కంపెనీల చేతుల్లోకి వెళ్లడాన్ని తీవ్రమైన విషయంగా పరిగణించింది. నిబంధనల ప్రకారం ప్రభుత్వం వద్ద ఉండే ఈ వ్యక్తిగత ఉద్యోగ, ఆర్థిక డేటా దుర్వినియోగం కాకుండా ఉండేందుకు నిపుణుల సలహాలతో వెంటనే సమర్థవంతమైన రక్షణ యంత్రాంగాన్ని, విధానాలను రూపొందించాలని కేంద్రాన్ని ధర్మాసనం ఆదేశించింది. బాధితులు లేదా ఉద్యోగుల నుంచి ఎలాంటి ఓటీపీ గానీ, స్పష్టమైన అనుమతి గానీ తీసుకోకుండానే.. కేవలం పాన్, యూనివర్సల్ అకౌంట్ నంబర్ (యూఏఎన్) ఉపయోగించి వారి పూర్తి సర్వీసు హిస్టరీని ప్రైవేట్ ఏజెన్సీలు యాక్సెస్ చేస్తున్నాయని పిటిషనర్ కోర్టు దృష్టికి తెచ్చారు. ఉద్యోగుల బ్యాక్‌గ్రౌండ్ చెక్, ఒకేసారి రెండు ఉద్యోగాలు చేసే మూన్‌లైటింగ్ గుర్తింపు, లేబర్ మార్కెట్ ప్రొఫైలింగ్ వంటి రిక్రూట్‌మెంట్ వ్యాపారాల కోసం ఈ ప్రభుత్వ డేటాపై ఆధారపడే ధోరణి పెరుగుతోందని వివరించారు. ఈ వాదనలను విన్న సుప్రీంకోర్టు, వ్యక్తిగత డేటా ప్రైవేట్ సంస్థల చేతుల్లో దుర్వినియోగం కాకుండా కేంద్రం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

## దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్న పెద్దపల్లి రాఖీ పరిశ్రమ....

కేవలం ఒక్క రోజు పండుగ కోసం ఏడాది పొడవునా సాగుతున్న ఈ తయారీ రంగం మహిళల ఆర్థిక స్వయంకృషికి నిదర్శనంగా మారుతోంది. ముడిసరుకుల సేకరణ నుంచి మార్కెటింగ్ వరకు ప్రతి విభాగంలోనూ మహిళలే ముందుండి నడిపిస్తూ తమ ప్రతిభను చాటుకుంటున్నారు. రాఖీల తయారీకి అవసరమైన ముడిసరుకులు గుజరాత్ ముంబై రాజస్థాన్ చెన్నై మీరట్ ప్రాంతాల నుంచి వస్తుండగా కొన్ని రకాల పూసలను చైనా దేశం నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. కంప్యూటర్ సహాయంతో సరికొత్త డిజైన్లను రూపొందించి స్థానిక అవసరాలతో పాటు రెండు తెలుగు రాష్ట్రాలు మహారాష్ట్ర కర్ణాటక ప్రాంతాలకు పెద్దఎత్తున ఎగుమతి చేస్తున్నారు. ఆన్లైన్ ఆర్డర్ల ద్వారా వ్యాపారం మరింత విస్తరించి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సంపాదించుకుంటోంది.

ప్రతి ఏటా లక్షలాది డిజైన్లలో రాఖీలు తయారవుతుండగా వేలాది మందికి ఉపాధి లభిస్తోంది. యజమాని ఇల్లెందుల కృష్ణమూర్తి మార్గదర్శకత్వంలో ఈ పరిశ్రమ విజయవంతంగా ముందుకు సాగుతోంది. ఉద్యోగాలు లేక ఇంటిపట్టునే ఉంటున్న మహిళలు యువతులకు ఈ పరిశ్రమ కొండంత అండగా నిలుస్తోంది. ఇల్లెందుల



రజనీ పర్యవేక్షణలో మహిళలు ఇంటి వద్దే ఉంటూ తమకు నచ్చిన డిజైన్లలో రాఖీలను సులభంగా తయారు చేస్తున్నారు. చేసిన పనులను బట్టి కూలి లభిస్తుండగా రోజువారీగా రెండు వందల యాభై రూపాయల నుంచి మూడు వందల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. మొదటగా సరైన శిక్షణ ఇచ్చి అనంతరం ఇళ్ల వద్దే చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. ఈ ఉపాధి విధానం ద్వారా ఎంతోమంది కుటుంబాలు ఆర్థికంగా బలపడి మెరుగైన జీవన ప్రమాణాలను సొంతం చేసుకుంటున్నాయి.

## తప్పుదోవ పట్టించే సమాచారం లేబుళ్లపై తొలగింపు

మాండెలెజ్ ఇండియా, ఆమ్వే ఇండియా సహా పలు ఆహార కంపెనీలు తమ లేబుళ్లపై ఉన్న 'పక్కదారి పట్టించే సమాచారాన్ని' తొలగించాయి.


ఆహార నియంత్రణాధికార సంస్థ ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు జారీ చేయడం ఇందుకు నేపథ్యం. 'నోటీసుల జారీ అనంతరం దిగ్గజ ఆహార వ్యాపార ఆపరేటర్లు (ఎఫ్‌బీఓలు) దిద్దుబాటు చర్యలు చేపట్టాయ'ని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. తప్పుదోవ పట్టించే సమాచారాన్ని తొలగించడం, ఉత్పత్తి ప్యాకేజింగ్‌ను మార్చడం వంటి చర్యలను కంపెనీలు చేపట్టాయి. ఆరోగ్యం, పోషకాల విషయంలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ తమ ఉత్పత్తులపై ముద్రించిన సమాచారాన్ని తొలగించినట్లు తెలిపింది. సేపియన్స్ ల్యాబ్స్, జుజా ఫుడ్స్ ఆఫ్ కేరళ కూడా మిస్‌లీడింగ్ క్లెయిములను తొలగించింది. విచి ఆగ్రో ప్రోడక్ట్స్ తప్పుదోవ పట్టించే ట్రేడ్ పేరును తీసేసింది. '100% స్వచ్ఛమైన కొబ్బరి నూనె' పేరిట ఆమ్వే ఇండియా ఎంటర్‌ప్రైజెస్ ఉల్లంఘనలకు పాల్పడిందని, దీంతో ఇపుడు 100% అనే పదాన్ని తొలగించిందని పేర్కొంది. ఎక్స్ఎస్ ఉత్పత్తి శ్రేణిలో 'ఎనర్జీ డ్రింక్' పేరును ఇక నుంచి ముద్రించదు.

## మార్కెట్‌లో ఉల్లి మంట.....

బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న ఉల్లి ధరల నుంచి సామాన్యులకు ఊరటనిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సాధారణ మార్కెట్ ధరలతో పోలిస్తే చాలా తక్కువగా, కిలో ఉల్లిపాయలను రూ. 35కే విక్రయించనున్నట్లు ప్రకటించింది. ప్రభుత్వ ఆధ్వర్యంలోని నాఫెడ్, ఎన్‌సీసీఎఫ్, కేంద్రీయ భండార్ అవుట్‌లెట్ల ద్వారా ఈ రాయితీ ఉల్లిపాయలు వినియోగదారులకు నేరుగా అందుబాటులోకి రానున్నాయి. దేశీయంగా ఉల్లి నిల్వలు సంతృప్తికరంగానే ఉన్నప్పటికీ, పండుగలు, డిమాండ్ ఉన్న సమయంలో ధరలపై పడుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం తమ వద్ద ఉన్న బఫర్ నిల్వలను నేరుగా మార్కెట్లోకి విడుదల చేస్తోంది. ఉల్లి కొరత ఉన్న ప్రధాన నగరాలకు వేగంగా సరుకును చేరవేసేందుకు కేంద్రం 'కందా ఎక్స్‌ప్రెస్' పేరుతో ప్రత్యేక రైలును ప్రారంభించింది. తొలి విడతలో చెన్నై, మదురై, ఎర్నాకులం, గౌహతీలకు పెద్ద ఎత్తున ఉల్లి రవాణా జరుగుతుండగా, రెండో విడతలో ఢిల్లీ, ఉత్తర భారత నగరాలకు సరఫరాలను పెంచనున్నారు.




## 2036 నాటికి దేశంలో 10.8 కోట్ల మంది సంపన్న కస్టమర్లు



భారత్ వినియోగదారుల మార్కెట్ రాబోయే పదేళ్లలో భారీగా మారనుంది. నీల్సన్‌ఐక్యూ, వరల్డ్ డేటా ల్యాబ్ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం, 2036 నాటికి రోజుకు 90 డాలర్లు (సుమారు రూ. 8,600) కంటే ఎక్కువ ఖర్చు చేసే 'సంపన్న వినియోగదారుల' సంఖ్యలో భారత్ చైనాను దాటనుంది. 2026లో 2.6 కోట్లుగా ఉన్న ఈ వర్గంవారు, రాబోయే దశాబ్దంలో మరో 8.2 కోట్లు పెరిగి ఏకంగా 10.8 కోట్లకు చేరుతుందని అంచనా. అదే సమయంలో చైనాలో ఈ సంఖ్య 10.3 కోట్ల వద్దే ఆగిపోనుంది.

అంతర్జాతీయంగా 23.1 కోట్ల మందితో అమెరికా అగ్రస్థానంలో ఉన్నప్పటికీ, అత్యంత వేగంగా సంపన్నుల సంఖ్య పెరుగుతున్న దేశంగా భారత్ ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. దీనికి తోడు రోజుకు రూ. 1,200 నుండి రూ. 8,600 ఖర్చు చేసే 'ప్రధాన వినియోగదారుల' సంఖ్య కూడా దేశంలో 64.9 కోట్లకు చేరుతుందని నివేదిక తెలిపింది. ఈ భారీ మార్పు గ్లోబల్ బ్రాండ్లకు అపారమైన అవకాశాలను తెచ్చిపెడుతోంది. ప్రపంచ జనాభాతో పోలిస్తే సంపన్న వినియోగదారుల సంఖ్య తక్కువే అయినప్పటికీ, 2026 నాటికి గ్లోబల్ వ్యయంలో వీరి వాటా ఏకంగా రూ. 3,437.78 లక్షల కోట్లుగా ఉండనుంది. అందువల్లే కంపెనీలు తమ ఉత్పత్తులను ప్రీమియం స్థాయికి అప్‌గ్రేడ్ చేయడానికి ఆసక్తి చూపుతున్నాయి. అయితే, 2021–2025 మధ్య వస్తువుల ధరలు 26 శాతం పెరగడంతో, కొనుగోలు శక్తి పెరిగినా 60 శాతం మంది భారతీయులు ఇప్పటికీ తాము పెట్టే డబ్బుకు సరిపడా నాణ్యత (వాల్యూ ఫర్ మనీ) ఉంటేనే కొనుగోలు చేయడానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రీమియం ధరలకు తగ్గ స్పష్టమైన ప్రయోజనం కనిపించకపోతే కస్టమర్లు చౌక ప్రత్యామ్నాయాలకు మారిపోతారని, అందుకే బ్రాండ్లు అందుబాటు ధరలు, ప్రీమియం క్వాలిటీ మధ్య సరైన సమతుల్యత పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## చక్కెర ధరలకు బ్రేక్



చక్కెర ధరల పెరుగుదలకు కేంద్ర ప్రభుత్వం బ్రేక్ వేసింది. గత వారం మిల్లుల వద్ద కిలో చక్కెర ధర రికార్డు స్థాయిలో రూ.67కు చేరగా, ప్రభుత్వ చర్యల తర్వాత అది 18 శాతం తగ్గి రూ.55కు వచ్చింది. మిల్లులు ధరలను అసాధారణంగా పెంచడం వల్లే ఈ పెరుగుదల వచ్చిందని ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. మార్కెట్‌ను దారిలోకి తెచ్చేందుకు కేంద్రం 10 లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతికి అనుమతినివ్వడంతో పాటు, బల్క్ వినియోగదారులపై నిల్వల పరిమితులు విధించింది. ఈ ఏడాది దేశీయ చక్కెర ఉత్పత్తి గతంలో అనుకున్న 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు పడిపోయినప్పటికీ, దేశీయంగా ఉన్న 280–285 లక్షల టన్నుల డిమాండ్‌కు సరిపడా నిల్వలు పుష్కలంగా ఉన్నాయని, అందుకే ఈ కృత్రిమ ధరల పెరుగుదలకు ఎలాంటి బలమైన కారణాలు లేవని అధికారులు స్పష్టం చేశారు. బ్లాక్ మార్కెటింగ్, అక్రమ నిల్వలను అరికట్టడానికి దేశవ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దించినట్లు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ (ఎన్ఎఫ్‌సీఎస్ఎఫ్) తెలిపింది. మిల్లులు ధరలను అసాధారణంగా పెంచడం వల్లే ఈ పెరుగుదల వచ్చిందని ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా తెలిపారు. మార్కెట్‌ను దారిలోకి తెచ్చేందుకు కేంద్రం 10 లక్షల టన్నుల ముడి చక్కెర దిగుమతికి అనుమతినివ్వడంతో పాటు, బల్క్ వినియోగదారులపై నిల్వల పరిమితులు విధించింది. ప్రస్తుతం దేశంలో ఏ మిల్లు వద్ద కూడా ధర రూ. 55 దాటి లేదని, రాబోయే రోజుల్లో ఇది మరింత తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

# సంస్కృతి పట్ల గౌరవాన్ని దుస్తులతో కొలుస్తారా!



పండగ స్ఫూర్తి అనేది భావోద్వేగాలు, సంప్రదాయాలలో ఉంటుందని.. అంతేగానీ ఒక మహిళ వస్త్రధారణలో ఉండదని అంటోంది బాలీవుడ్ నటి కృతి సనన్. ఇటీవల ఆమె చేసిన రక్షాబంధన్ వాణిజ్య ప్రకటనపై సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అందులో ఆమె రాఖీ పండగకు ధరించిన దుస్తులపైనా, పెంపుడు జంతువుకు రాఖీ కట్టడం గురించి నెటిజన్ల నుంచి విమర్శలొచ్చాయి. ఈ నేపథ్యంలో వాటికి గట్టిగా బదులిస్తూ కృతి తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఓ పోస్ట్ పెట్టారు. "మహిళలు ఏమి ధరించాలో చెప్పడం మనం ఎప్పుడు ఆపుతాం? ఏళ్ల తరబడి సంప్రదాయ ఫ్యాషన్ ఎంతో అభివృద్ధి చెందుతుంది. కానీ, ఇప్పటికీ ఒక మహిళ తన సంస్కృతి పట్ల చూపించే గౌరవాన్ని కేవలం ఆమె దుస్తులతోనే కొలుస్తున్నారు. సంస్కృతి, సంప్రదాయాలు ఆమె హృదయంలో ఉంటాయి. ఆమె నెక్‌లైన్‌లో కాదు! పండగల స్ఫూర్తి మనం ధరించే దుస్తులలో లేదు. సంప్రదాయాల పట్ల మనం కలిగి ఉండే భావోద్వేగాలు, వాటి అర్థంలో ఉంది. రాఖీ ఒక రక్షణ బంధం. నేనూ, నా సోదరి ఒకరికొకరం రాఖీ కట్టుకుంటాం. సోదరులు ఎలాగైతే ఒకరినొకరు కాపాడుకుంటారో మేమూ అదే స్థాయిలో మమ్మల్ని కాపాడుకోగలం. ఈ వాగ్దానం మాకు, మా కుక్కలకు కూడా వర్తిస్తుంది. ఏదేమైనా అవి మా కుటుంబమే కదా!" అని అందులో రాసుకొచ్చారు.

# రజినీకాంత్‌ను కలిశానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా...



అనుకోకుండా విమానంలో పక్కనే సూపర్ స్టార్ రజినీకాంత్ వచ్చి కూర్చుంటే ఏ అభిమానికైనా అదో అద్భుతమైన అనుభూతే. సరిగ్గా అలాంటి అరుదైన సర్ ప్రైజ్ హైదరాబాద్ వెళ్లే ఫ్లైట్‌లో నటి కయాదు లోహర్‌కు లభించింది. థలైవర్ పక్కనే కూర్చునే అవకాశం రావడంతో ఆమె ఆనందానికి హద్దులు లేకుండా పోయాయి. రజినీకాంత్‌తో కలిసి తీసుకున్న సెల్ఫీని తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా షేర్ చేస్తూ, ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తనను తాను రజినీకాంత్ కు అతిపెద్ద అభిమానిగా చెప్పుకొచ్చారు.

రజినీకాంత్‌ను అంత దగ్గరగా చూసిన క్షణంలో తాను ఇంకా కలలోనే ఉన్నట్లు అనిపించిందని కయాదు తెలిపారు. సూపర్ స్టార్‌ను కలిశానంటే ఇప్పటికీ నమ్మలేకపోతున్నా అని.. ఆయనను చూడగానే తన మనసులో సుందరి పాట మోగడం మొదలైందని, చాలా ఊహించని మధురమైన క్షణంలో ఉండిపోయానని వివరించారు. ఒక అభిమానిగా ఆయన పక్కన కూర్చునే అదృష్టం దక్కడంతో తన రోజు ఎంతో ప్రత్యేకంగా మారిందని సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఎప్పటికైనా రజినీకాంత్‌తో కలిసి ఒక సినిమాలో స్క్రీన్ పంచుకోవాలని ఆశిస్తున్నట్లు తన కోరికను బయటపెట్టారు. తాను ఆ సెల్ఫీలో చూడటానికి బంగాళాదుంపలా ఉన్నానని స్మైల్ ఎమోజీని జత చేశారు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఇక కయాదు లోహర్ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల పల్లిచట్టంబి, ఇదాయం మురళి వంటి చిత్రాలతో మెప్పించిన ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్ సరసన 'ఐయామ్ గేమ్' చిత్రంలో నటిస్తుండగా.. తెలుగులో నేచురల్ స్టార్ నానితో నటించే చాన్స్ దక్కించుకున్నారు.

శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రాబోతున్న 'ది ప్యారడైజ్' మూవీలో సుబ్బలక్ష్మి పాత్రలో కనిపించనున్నారు. 'దసరా' వంటి సూపర్ హిట్ తర్వాత నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో రాబోతున్న సినిమా కావడంతో ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# యూనిక్ సర్వైవల్ డ్రామా థ్రిల్లర్....

కికు యనమల, కశిష్ ఖాన్ జంటగా నటిస్తున్న సినిమా 'చిరంజీవి'. ఈశ్వరి రావు, తనికెళ్ల భరణి, శ్రీకాంత్ భరత్, వైవా రాఘవ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. కికు ఎంటర్ టైన్ మెంట్స్ బ్యానర్ పై దీప్తి నడిమింటి నిర్మిస్తున్నారు. శుభ సాయి వెంకట్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 28న థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో మంగళ వారం ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ యష్ మిట్టల్ మాట్లాడుతూ,'మా సినిమా సరికొత్త కంటెంట్తో మీ ముందుకు రాబోతోంది. థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా' అని తెలిపారు. 'ఈ సినిమా మొదటి నుంచి చివరి వరకు ఒక్క నిమిషం కూడా మీరు చూపు తిప్పుకోకుండా ఎంగేజ్ చేసేలా ఉంటుంది. కికు, దీప్తి, డైరెక్టర్ శుభ మొదటి నుంచి సినిమాను నమ్మారు. వాళ్ల నమ్మకం థియేటర్స్ లో నిజం కావాలి' అని ఎడిటర్ ఛోటా కె ప్రసాద్ చెప్పారు. డైరెక్టర్ శుభ సాయి వెంకట్ మాట్లాడుతూ,'మా సినిమాకు వచ్చిన ఇబ్బందులు సాల్వ్ అయ్యేలా ప్రొడ్యూసర్ కౌన్సిల్ తరుపున మా ప్రసన్న సహకారం అందించారు. ఆయనకు థ్యాంక్స్. ఈ కథలో ఒక డేరింగ్ రిస్కీ ఎలిమెంట్ ఉంది. అలాంటి రిస్కీ పాయింట్ ను నమ్మి మా ప్రొడ్యూసర్స్ సినిమా చేశారు. కథను నమ్మి నిలబడ్డారు.



వారి కోసం మా మూవీ హిట్ కావాలి' అని అన్నారు. ప్రొడ్యూసర్ దీప్తి నడిమింటి మాట్లాడుతూ,'ఒక మంచి సినిమా చేశామనే నమ్మకంతో మేమంతా ఉన్నాం. సినిమా కంటెంట్ మీద నమ్మకంతో ఈ నెల 28న ధైర్యంగా చిత్రాన్ని రిలీజ్ చేస్తున్నాం. మీరు థియేటర్స్ కు రండి ఎక్కడా డిజప్పాయింట్ అవరు. ప్రొడ్యూసర్స్ గా నా గ్యారెంటీ ఇది' అని తెలిపారు

# 'కబీర్ సింగ్'కి ముందే కియారాకి ఆ ఫ్లాప్ స్టోరీ చెప్పా....





కోలీవుడ్‌లో దర్శకుడిగా, నిర్మాతగా గుర్తింపు సంపాదించుకున్న విఘ్నేష్ శివన్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. తాజాగా ఈయన కన్నడ నటుడు యాష్ హీరోగా తెరకెక్కిన 'టాక్సిక్' చిత్రానికి సంబంధించిన ఓ ఈవెంట్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 'టాక్సిక్' చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటించిన విషయం తెలిసిందే. ఈవెంట్‌లో విఘ్నేష్ శివన్ కియారా గురించి మాట్లాడుతూ.. నేను 'కబీర్ సింగ్' సినిమా విడుదల కాకముందు కియారాను కలిసి ఓ సినిమా కథను వినిపించాను. అయితే ఆమె ఆ సినిమా చేయడానికి ఒప్పుకోలేదు. ఆ సినిమాను నేను కొంతకాలం క్రితమే రూపొందించాను.

# 'అలియాస్ రుక్మిణి' సినిమాలో నితిన్‌కి జోడీగా కన్నడ బ్యూటీ!




'సప్త సాగరాలు దాటి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టిన కన్నడ భామ రుక్మిణి వసంత్, తొలి సినిమాతోనే తెలుగు, కన్నడ ప్రేక్షకుల్లో ఊహించని క్రేజ్ సంపాదించుకున్నారు. తన నటనతో, అందంతో కుర్రకారును మంత్రముగ్ధులను చేసిన ఈ భామ, ఇటీవల వచ్చిన 'కాంతార: చాప్టర్ 1' ఘనవిజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ బ్యూటీ 'టాక్సిక్' చిత్రంతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తూ వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు. ఈ క్రమంలోనే.. తాజాగా, రుక్మిణి వసంత్ ఖాతాలో మరో బిగ్ ప్రాజెక్ట్‌లో చేరినట్లు సోషల్ మీడియాలో పలు పోస్టులు వైరల్ అవుతున్నాయి. నితిన్ హీరోగా నటిస్తున్న 'అలియాస్ రుక్మిణి' చిత్రంలో ఆమెను హీరోయిన్‌గా ఎంపిక చేసినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాను నాచురల్ స్టార్ నాని తన సొంత నిర్మాణ సంస్థ యూనానిమస్ బ్యానర్‌పై ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తుండటం విశేషం. మురళీకాంత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం ఇప్పటికే పూజా కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. సినిమా ప్రకటన సందర్భంగా చిత్రబృందం విడుదల చేసిన ప్రత్యేక వీడియో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోవడమే కాకుండా సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. అతి త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ కూడా ప్రారంభం కానుందని సమాచారం.

# 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్' తెలుగు విడుదల తేదీ వచ్చేసింది

నివిన్ పౌలీ, మమితా బైజు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్'. గిరీష్ ఏ.డీ. దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఆగస్టు 20న మలయాళ భాషలో విడుదలైంది. మంచి అంచనాల నడుమ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం ఇప్పటికే బ్లాక్‌బస్టర్ టాక్‌ను సొంతం చేసుకుని అద్భుతమైన కలెక్షన్లను రాబడుతోంది. ఇప్పటికే మంచి విజయాన్ని అందుకున్న ఈ సినిమాను తెలుగులో కూడా విడుదల చేయనున్నారు. తాజాగా దీనికి సంబంధించిన అధికారిక ప్రకటనను మేకర్స్ విడుదల చేశారు. ఈ మూవీని సెప్టెంబర్ 4న తెలుగులో రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. తెలుగులోనూ 'బెత్లెహేమ్ కుటుంబ యూనిట్' అనే టైటిల్‌తోనే ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.




E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com